
**టాప్ న్యూస్**




మునిసిపల్ ఫలితాలపై
## రాహుల్ హ్యాపీ
- ఈ విజయం తెలంగాణ ప్రజలదంటూ ట్వీట్

02



స్థానిక పరిస్థితులను
## బట్టి పొత్తులు
- 30 మునిసిపాలిటీలు ఆశించాం.. తగ్గాయి
- కరీంనగర్, నిజామాబాద్ తప్ప ఎక్కడ బీజేపీ లేదు
- కేటీఆర్

02



తెలంగాణ నేలకు
## పాదాభివందనాలు
- ఒకటితో ఆదరించారు.. లేలేత అడుగులతో మొదలయ్యాం
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ భావోద్వేగం

02


ann తెలుగు

Follow: @ANNTELUGU

15-02-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్    సంపుటి- 23    సంచిక- 48    పేజీలు-08    వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI    REGISTERED NUMBER: APTEL/2003/09316    WWW.EPAPER.MAHAADAILY.COM




# శివోహం
## మహా శివరాత్రి.. మహా క్షేత్రాలు

(మహా ప్రత్యేకం)

శివుడు విశ్వ సృష్టికర్త.. విశ్వాన్ని సృష్టించిన ముగ్గురు ప్రధాన దేవుళ్ళలో ఒకరు. శివుడు శివలింగం, రుద్రాక్షతో సహా అనేక రూపాలలో పూజించబడతాడు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో.. కృష్ణ పక్ష చతుర్దశి తిథిలో మహాశివరాత్రి వస్తుంది. మహాశివరాత్రి పురస్కరించుకుని దేశంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగుతున్నాయి రెండు తెలుగు రాష్ట్రాలలో మహాశివరాత్రి వేడుకలు కన్నుల పండుగగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం శివరాత్రి మహా పర్వదినం వచ్చిందంటే చాలు ఊరూర వెలసిన శివక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడిపోతాయి.

ప్రత్యేక కథనం 4లో



# రేవంత్.. మీరు సూపర్
## జాతీయస్థాయిలో ప్రశంసల వెల్లువ

రాహుల్, ప్రియాంక, కేసీ సహా వివిధ రాష్ట్రాల నేతల అభినందనలు

ఇతర రాష్ట్రాల నుండి.. సెక్యులర్ పార్టీ నేతల ఫోన్లు

పలువురు జాతీయ జర్నలిస్టులు, వివిధ రంగాల నిపుణుల ఫోన్లు

మీ నాయకత్వం కాంగ్రెస్ కు ఊరటగా.. వెలుగుగా కనిపిస్తోందంటూ అభినందనలు

70 శాతానికి పైగా మునిసిపాలిటీలు కైవసం చేసుకున్న కాంగ్రెస్

**హైదరాబాద్ - మహా:** ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మునిసిపోల్స్ లో సాధించిన విక్టరీపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది. దేశమంతా కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర ఫలితాలొస్తున్నవేళ అటు బీజేపీని, ఇటు బీఆర్ఎస్ ను మడతపెట్టి కాంగ్రెస్ పార్టీ 70శాతానికి పైగా మునిసిపాలిటీలు కైవసం చేసుకోవడంతో జాతీయస్థాయి నేతలు ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ ఈ స్థాయి సామర్థ్యం ఏ రాష్ట్రంలోనూ ప్రదర్శించలేదు. రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఏకపక్ష విజయానికి జాతీయనేతలు ప్రశంసిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

వివరాలు 2లో

## హంగ్‌లోనూ కింగ్ కావాలి

37 మునిసిపాలిటీలపై ప్రత్యేక వ్యూహం

మంత్రులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

బాగా కష్టపడ్డారంటూ మంత్రులను అభినందించిన సీఎం

భవిష్యత్ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగాలి

సమిష్టి కృషితోనే అద్భుత ఫలితాలు

2లో

# ఓటింగ్‌లో కాంగ్రెస్సే కింగ్
## సెకండ్ బీఆర్ఎస్.. థర్డ్ బీజేపీ
### పోలింగ్ శాతం ప్రకటించిన ఈసీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంతశాతం ఓటింగ్ వచ్చింది అనే వివరాలను శనివారం సాయంత్రం ఎన్నికల సంఘం ప్రకటించింది. కాంగ్రెస్ మొదటి స్థానంలో, బీఆర్ఎస్ రెండో స్థానంలో, బీజేపీ మూడో స్థానంలో , ఎంఐఎం నాలుగోస్థానంలో నిలిచాయి. జనసే పార్టీ 0.35 శాతం ఓట్లతో తొమ్మిదో స్థానంతో నిలిచింది. అధికార కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ 39.8 శాతం ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 28.7 శాతం ఓట్లు వచ్చాయని ఈసీ వెల్లడించింది. అటు బీజేపీకి 15.6 శాతం, ఎంఐఎం 3.2 శాతం, ఏఐఎఫ్ బి 1.5 శాతం, సీపీఐ 1.3 శాతం, సీపీఎం 0.5 శాతం ఓట్లు వచ్చాయని తెలిపింది. మొత్తం 116 మున్సిపాలిటీల్లోని 2,582 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 1347 వార్డుల్లో విజయం సాధించింది. అదే సమయంలో 116 మున్సిపాలిటీలకు గానూ 64 మున్సిపాలిటీల్లో హస్తం పాగా వేసింది. ఆ తర్వాత.. బీఆర్ఎస్ పార్టీ 717 వార్డులను గెలుచుకుంది. 13 మున్సిపాలిటీల్లో గులాబీ జెండాను ఎగురవేసింది. మరోవైపు.. బీజేపీ 261 వార్డుల్లో విజయం సాధించింది. ఇండిపెండెంట్ అభ్యర్థులు ఏకంగా 256 వార్డుల్లో జయకేతనం ఎగువేశారు.

కాంగ్రెస్ - 39.80 శాతం ఓట్లు

బీఆర్ఎస్- 28.75 శాతం ఓట్లు

బీజేపీ - 15.67 శాతం ఓట్లు

స్వతంత్ర అభ్యర్థులు- 8.30 శాతం ఓట్లు

ఎంఐఎం- 3.28 శాతం ఓట్లు

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ - 1.51 శాతం ఓట్లు

సీపీఐ - 1.30 శాతం ఓట్లు

సీపీఎం- 0.58 శాతం ఓట్లు


జనసేన - 0.35 శాతం ఓట్లు

# ఆదిలాబాద్‌లో రసవత్తర రాజకీయం
## బల్దియా కైవసం చేసుకునే దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు
### సమీక్షించిన సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** ఆదిలాబాద్ మునిసిపాలిటీని కైసవ చేసుకునేదిశగా కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. శనివారం రాత్రి ఆదిలాబాద్ జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రి జూపల్లి క్రిష్ణారావుతో పాటు కీలక నేతలు రంగంలోకి దిగారు. ఆదిలాబాద్‌లో స్వతంత్ర కౌన్సిలర్లతో కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మంతనాలు జరపగా, ముగ్గురు స్వతంత్ర కౌన్సిలర్లతో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్ క్యాంపుకు వెళ్ళినట్లు తెలిసింది. ఒక స్వతంత్ర అభ్యర్థికి ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ నేతల సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.




ఐదుగురు స్వతంత్రులు, ఎంఐఎం,ఇతరుల మద్దతుతో ఈ స్థానం కాంగ్రెస్ దక్కించుకుంటుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 27మంది మద్దతు కూడగట్టినట్లు తెలుస్తోంది.



## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం
- ఐఏఎస్ అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి
- ఛార్జిషీట్ దాఖలు చేయనున్న ఏసీబీ

**హైదరాబాద్, మహా:** ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతంలోనే గవర్నర్ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఈకార్ రేసు కేసులో త్వరలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ఛార్జిషీట్ దాఖలు చేయనుంది.

**ప్రభుత్వానికి ఏసీబీ నివేదిక**

గతేడాది సెప్టెంబర్‌లో ఈ కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

మిగతా 2లో

# రూ.3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

**అమరావతి, మహా :** ఏపీ శాసనసభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని.. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగులు పెట్టించాలనే సంకల్పం లాంటిదని పేర్కొన్నారు. 202627వ ఆర్థిక సంవత్సరంలో కూడా సీఎం చంద్రబాబు నేతృత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రెండంకెల వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. 202627 ఏడాదిలో కూడా 10.75 శాతం మేర వృద్ధి నమోదు అవుతుందని ఆర్థిక శాఖ అంచనా వేసిందన్నారు.

**బడ్జెట్ ముఖ్యాంశాలు..**

రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు
విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు
రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు రూ.13,546 కోట్లు
పరిశ్రమలకు రూ.3,161 కోట్లు
సర్దుబాటు నిధి.. రూ.1,500 కోట్లు
వీబీ జీ రామ్ జీకి.. రూ.8365 కోట్లు
గృహ నిర్మాణ రంగానికి రూ.5,451 కోట్లు
ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4000 కోట్లు
జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు
స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.1,037 కోట్లు
విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు.. ఈ ఆర్థిక ప్రాంతం పరిధిలోకి పది జిల్లాలు



**బడ్జెట్ స్వరూపం.. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్**

| | |
|---|---|
| రెవెన్యూ వ్యయం | రూ.2,56,143 కోట్లు |
| మూలధన వ్యయం | రూ.53,915 కోట్లు |
| రెవెన్యూ లోటు | రూ.22,002 కోట్లు |
| ద్రవ్య లోటు | రూ.75,868 కోట్లు |

9 జిల్లాలతో అమరావతి ఆర్థిక ప్రాంతం
రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు రూ.30,000 కోట్లు
ప్రతి జిల్లాకు ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్
పాఠశాల విద్యాశాఖ రూ.32,308 కోట్లు
పంచాయతీరాజ్ రూ.22,942 కోట్లు

మిగతా 2లో

## భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్
- ఫ్లైట్ టికెట్స్, హోటల్ రెంటల్స్ కు రెక్కలు
- విమానం టికెట్లకు డబుల్ రేటు.. హోటల్ గది లక్షకు పైనే

02




## స్థానిక పరిస్థితులను బట్టి పొత్తులు

- 30 మునిసిపాలిటీలు ఆశించాం.. తగ్గాయి
- కరీంనగర్, నిజామాబాద్ తప్ప ఎక్కడ బీజేపీ లేదు-కేటీఆర్

**హైదరాబాద్, మహా:** స్థానిక ఎన్నికలు కాబట్టి స్థానిక పరిస్థితులను బట్టి పొత్తులు ఉంటాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాము 30 మునిసిపాలిటీలు ఆశించామని, కొన్ని తగ్గాయని.. ఈ ఎన్నికలకు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధం ఉండదన్నారు. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని (హంగ్) మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా చైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన 'ఎక్స్ అఫీషియో' ఓట్ల నమోదు విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులతో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తమ పార్టీకి ఉన్న ప్రజాప్రతినిధుల మద్దతుతో హంగ్ ఏర్పడిన చోట్ల కూడా పట్టు సాధిస్తామని స్పష్టం చేశారు. బీజేపీ పరిస్థితిని ప్రస్తావిస్తూ.. కరీంనగర్, నిజామాబాద్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ ప్రభావం శూన్యమని కొట్టిపారేశారు.

## రూ.3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయం, అనుబంధ రంగాలు రూ.13,598 కోట్లు
అన్నదాత సుఖీభవ రూ.6,660 కోట్లు
పోలవరం రూ.6,105 కోట్లు
హోంశాఖ రూ.9,165 కోట్లు
మున్సిపల్ శాఖరూ.14,539 కోట్లు
జలవనరుల శాఖ రూ.18,224 కోట్లు
హాస్టళ్లు, గురుకులాలకు రూ.300 కోట్లు
విద్యార్థులకు ఉపకారవేతనాలకు రూ.3,836 కోట్లు
మధ్యాహ్న భోజన పథకం.. రూ.2,161 కోట్లు
ఎన్టీఆర్ భరోసా.. రూ.27,719 కోట్లు

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

(మొదటిపేజీ తరువాయి)

తదుపరి ప్రాసిక్యూషన్‌కు తమకు అనుమతి ఇవ్వాలని నివేదిక పంపారు. మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అధికారి అర్వింద్‌లను ఏసీబీ పలుమార్లు విచారణకు పిలిచి ప్రశ్నించింది. ఫార్ములా ఈకార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబర్ 18వ తేదీన ఏసీబీ కేసు నమోదుచేసింది. అందులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై కేసు నమోదైంది. తాజాగా అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతివ్వడంతో కేసు విచారణలో వేగం పెరగనున్నట్లుగా తెలుస్తోంది. ఈ కేసులో త్వరలో ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు ఏసీబీ సిద్ధమవుతోంది.

## మునిసిపల్ ఫలితాలపై రాహుల్ హ్యాపీ

**ఈ విజయం తెలంగాణ ప్రజలదంటూ ట్వీట్**

**మహా:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం ప్రజా అనుకూల ప్రభుత్వ విధానాలకు స్పష్టమైన మద్దతు అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, గౌరవం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో అమలు చేస్తున్న ప్రభుత్వ విధానాలకు ప్రజలు మద్దతు తెలిపారన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విజయం పార్టీదే కాదని, తెలంగాణ ప్రజలదని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు అందే ప్రజా తెలంగాణ దిశగా కాంగ్రెస్ పార్టీ అంచలంచెలుగా ఎదుగుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

## భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్

- ఫ్లైట్ టికెట్స్, హోటల్ రెంటల్స్ కు రెక్కలు
- విమానం టికెట్లకు డబుల్ రేటు.. హోటల్ గది లక్షకు పైనే

**మహా:** టీ క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా భారత్, పాకిస్తాన్ మధ్య ఫిబ్రవరి 15న శ్రీలంకలోని కొలంబోలో సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ జరుగనుంది. ఈ హై వోల్టేజ్ మ్యాచ్ కోసం క్రికెట్ లవర్స్ ఉత్కంఠగా వెయిట్ చేస్తున్నారు. మ్యాచ్ జరిగే గ్రౌండ్ కు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. దాయాదులతో మ్యాచ్ అంటే ఉత్కంఠభరితమే కదా. ఈ నేపథ్యంలో ఫ్లైట్ టికెట్స్, హోటల్ రెంటల్స్ కు రెక్కలొచ్చాయి. విమాన టికెట్ ధర ఏకంగా 50శాతానికి పైగా పెరిగింది. మీరు ఫిబ్రవరి 14, 15 తేదీలలో కొలంబోలోని ఒక పెద్ద 3 లేదా 5స్టార్ హోటల్‌లో ఇద్దరు వ్యక్తులకు గదిని బుక్ చేసుకుంటే ఖర్చు రూ.1.14 లక్షల వరకు ఉంటుంది. ఇక 50 నుండి 60 వేలు ఉండే విమాన ఛార్జీలు రూ. లక్ష నుండి లక్షన్నర వరకు పెరిగాయి. అయినా అభిమానులు తగ్గేదేలే అంటున్నారు.

# రేవంత్.. మీరు సూపర్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డి మునిసిపోల్స్ లో సాధించిన విక్టరీపై జాతీయస్థాయిలో చర్చ జరుగుతోంది. దేశమంతా కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర ఫలితాలొస్తున్నవేళ అటు బీజేపీని, ఇటు బీఆర్ఎస్ ను మడతపెట్టి కాంగ్రెస్ పార్టీ 70శాతానికి పైగా మునిసిపాలిటీలు కైవసం చేసుకోవడంతో జాతీయస్థాయి నేతలు ఆశ్చర్యపోతున్నారు. ఇటీవల కాలంలో కాంగ్రెస్ ఈ స్థాయి సామర్థ్యం ఏ రాష్ట్రంలోనూ ప్రదర్శించలేదు. రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఏకపక్ష విజయానికి జాతీయనేతలు ప్రశంసిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. పార్టీ జాతీయ నాయకులతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన నేతలు రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుస్థిర పరిపాలన, సామాజిక సాధికారత కోసం స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతుకు ఈ ఫలితాలు నిదర్శనంగా నిలుస్తాయని నేతలు అభిప్రాయపడ్డారు. అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలే కాకుండా.. దేశంలో ప్రత్యామ్నాయం ఆశించే నేతలు రేవంత్ విజయానికి అబ్బురపడి అభినందనలు తెలుపుతున్నారు.

**రేవంత్ నాయకత్వ పటిమ**

ఈ ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత, రాష్ట్ర ప్రజల పురోభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఖర్గే పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమ్మిళిత వృద్ధి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు స్థానిక ఎన్నికల్లో స్పష్టమైన ఆమోదముద్ర వేశారని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలు, నాయకులకు రాహుల్ గాంధీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. లోక్‌సభ సభ్యురాలు, ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విజయాన్ని సాధ్యం చేయడంలో కృషి చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకుల నిబద్ధతకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



**కేసీ వేణుగోపాల్ అభినందనలు**

రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి దిశగా సుసంపన్నమైన తెలంగాణను నిర్మించాలన్న కాంగ్రెస్ సంకల్పానికి ఈ విజయం మరింత బలాన్ని చేకూరుస్తుందని , ఎన్నికల్లో ఈ ఘన విజయం కాంగ్రెస్ నమూనా పరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్స్) కేసీ వేణుగోపాల్ అభివర్ణించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బలమైన నాయకత్వం, పార్టీతో సమన్వయంతో ఈ ఘన విజయం సాధ్యమైందని ఎంపీ, లోక్‌సభలో కాంగ్రెస్ విప్ మానిక్కం ఠాగూర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచారని ఈ ఎన్నికలు రుజువు చేస్తున్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కోశాధికారి విజయ్ వసంత్ తెలిపారు. కింది స్థాయి వరకు కాంగ్రెస్ ప్రజల్లో బలంగా వెళ్లానుకుందని ఈ ఎన్నికల ఫలితాలు తార్కాణమని అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ, ప్రభుత్వ పనితీరుకు ప్రజల ఆమోదానికి ఇది నిదర్శనమని ఆల్ ఇండియా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సచిన్ సావంత్ ఎక్స్ ద్వారా పేర్కొన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు అభినందనలు తెలిపారు. ఇటీవలి ఉపఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు తిరుగులేని విజయాన్ని చేకూర్చారని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నేతలు, రాజ్ దీప్ సర్దేశాయ్ లాంటి ప్రముఖ జర్నలిస్టులు రేవంత్ విజయానికి అభినందనలు తెలిపారు. వామపక్షాల నేతలు రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు ఫోన్లు చేశారు.

## హంగ్‌లోనూ కింగ్ కావాలి

**హైదరాబాద్, మహా :** మునిసిపల్ ఎన్నికల్లో బాగా కష్టపడి అద్భుత ఫలితాలు తెచ్చారంటూ మంత్రులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కాంగ్రెస్ పార్టీ దృష్టిసారించింది. ఈ క్రమంలోనే మంత్రులు, సీనియర్ నేతలతో జూబ్లీహిల్స్‌లోని క్యాంపు ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల ఫలితాలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆశించిన ఫలితాలు రావడంతో సంతృప్తిని వ్యక్తం చేసిన సీఎం హంగ్ మున్సిపాలిటీల విషయంలో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

**హంగ్ లోనూ కింగ్**

హంగ్ ఏర్పడిన 37 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో పార్టీ వ్యూహంపై మంత్రులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. సోమవారం మేయర్లు, చైర్మన్ల ఎన్నిక నేపథ్యంలో ఎక్స్ అఫిషియో ఓట్ షేర్‌పై సీఎం రేవంత్ సూచనలు చేశారు. ఫలితాల్లో 37 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది. వీటిలో సాధ్యమైనన్ని మున్సిపాలిటీలలో అధికారం నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. స్వతంత్రుల మద్దతుతో సుమారు 20 వరకు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసే అవకాశాలున్నాయని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆ దిశగా తీసుకోవాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అలాగే మేయర్, చైర్మన్ ఎంపిక కార్యాచరణపై కూడా ఆయన నేతలకు ఆదేశాలు జారీచేశారు. ఎక్స్ అఫీషియో ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులకు సీఎం సూచనలు చేశారని తెలుస్తోంది. నిజామాబాద్‌లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంఐఎం పార్టీతో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు సీఎం రేవంత్ సూచించారు.

**నమ్మకానికి నిదర్శనం..**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై మంత్రులను, కార్యకర్తలను అభినందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించింది. మా సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రులందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ స్థాయిలో ఫలితాలు వచ్చాయని ఆయన కొనియాడారు.

**మున్సిపాలిటీలకు కొత్త రూపం..**

ఎన్నికల విజయం కేవలం ఆరంభం మాత్రమేనని, అసలైన అభివృద్ధి ఇప్పుడే మొదలవ్వాలని మంత్రులకు సీఎం సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు, మంత్రులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ ఫలాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికలనూ ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ప్రజా తీర్పును కాలరాస్తే వారిని తిరగనివ్వను

**కరీంనగర్ మేయర్ పీఠం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుట్రలు**

**ఎవరెన్ని కుట్రలు చేసినా పీఠం మాదే.. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటుతాం.. కేంద్ర మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, మహా :** కరీంనగర్ మేయర్ పీఠంపై అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ఎంఐఎం, బీఆర్ఎస్ లు కుట్ర చేస్తున్నాయని, మూడు పార్టీలు ఏకమై కరీంనగర్ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా మేయర్ పీఠం స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడిన సంజయ్ ప్రజా తీర్పును కాలరాసి ఏమైనా కుట్రలు చేస్తే ఆ తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. కుట్రలు చేస్తే కరీంనగర్ నుంచి యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాయన్నారు. బీజేపీకి మేయర్ పదవి రాకుండా మూడు పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయని, కరీంనగర్ వేదికగా మూడు పార్టీల బండారం బయటపడుతోందన్నారు. బీజేపీకి బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రజాతీర్పును కాలరాస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను తిరగనివ్వను అని తీవ్రంగా హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వలంటైన్స్ డే శుభాకాంక్షలంటూ వ్యంగ్యంగా అన్న సంజయ్ ఈ రెండు పార్టీలతో ఎంఐఎం అక్రమ సంబంధం కొనసాగిస్తోందన్నారు. కాంగ్రెస్ తో సంసారం చేస్తూ బీఆర్ఎస్‌కు ఎంఐఎం కన్ను కొడుతోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అక్రమ సంబంధానికి అనుసంధాన కర్త ఎంఐఎం అని అన్నారు. మోదీ ఆశీస్సులు, పాలన, కార్యకర్తల కష్టంతో కరీంనగర్ లో బీజేపీ మెజారిటీ స్థానాలు గెలుచుకుందని, అద్భుతమైన తీర్పు ఇచ్చిన కరీంనగర్ ప్రజలకు ధన్యవాదాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకుని కరీంనగర్ లో బీజేపీ గెలిచిందని, ఇండిపెండెంట్లు కూడా బీజేపీలో చేరడంతో మ్యాజిక్ ఫిగర్ దాటిందని తెలిపారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిస్తే కూడా 26 సీట్లకే పరిమితమయ్యాయని, అయినా బీజేపీకి మేయర్ పదవి రానీయ్యకూడదని ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయని తెలిపారు. కరీంనగర్ వేదికగా ఈ మూడు పార్టీల బండారం బయటపడబోతోందని, మూడు పార్టీల దిగజారుడు రాజకీయాలను జనం అసహ్యించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు బహిరంగంగా ఒక్కటై మాట్లాడుకుంటున్నారని, సీఎం ఫోన్ చేసి కోరారని, బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ ప్రతిపాదించే అభ్యర్థికి మద్దతిద్దామని స్థానిక ఎమ్మెల్యే తన పార్టీ కార్పొరేటర్లకు చెబుతున్నారని సంజయ్ తెలిపారు. తమకే మేయర్ పదవి కావాలని ఎంఐఎం కోరుతోందన్నారు. బీజేపీ కార్పొరేటర్లను కూడా ప్రలోభపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లో కలిసి ఉండాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు తీసుకున్న నిర్ణయం ఆ పార్టీల రాష్ట్ర నాయకత్వాల నిర్ణయమా? స్థానిక నేతల అభిప్రాయమా? స్పష్టం చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ల అంతర్గత అవగాహన కారణంగానే ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం కేసుల్లో ఆధారాలున్నా కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయడం లేదన్న విషయం స్పష్టమవుతుందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందని, ఇది గమనించే ప్రజలు బీజేపీని ఆశీర్వదించారని చెప్పారు. గెలిచిన ఇండిపెండెంట్లు సైతం మంచి ఆలోచనతో బీజేపీలో చేరుతున్నారని, అయినా కుట్రలు, కుతంత్రాలు చేసి మేయర్ పదవి బీజేపీకి దక్కకుండా చేయాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా తీర్పుకు భిన్నంగా కుట్రలు చేస్తే కరీంనగర్ నుండే మీ అంతు చూస్తా అని బీఆర్ఎస్, కాంగ్రెస్ లను సంజయ్ హెచ్చరించారు. బీజేపీ శక్తి ఏందో, కరీంనగర్ ప్రజల దమ్మేందో చూపిస్తామన్నారు. ప్రజాతీర్పును కాలరాస్తే కరీంనగర్ లో ఒక్క కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతను తిరగనీయనని శపథం చేశారు. కరీంనగర్ కేంద్రంగా కాంగ్రెస్ హామీలపై నిలదీస్తానని అంటూ మహిళలకు ఇస్తానన్న రూ.2500లు ఎందుకు ఇవ్వడంతోనే లక్షలాది మంది మహిళలను రోడ్లపైకి తీసుకొచ్చి నిలదీస్తానని అన్నారు. అదే విధంగా రూ. .4 వేల పెన్షన్, రిటైర్డ్ బెనిఫిట్స్, డీఏలు, ఈపీఎఫ్ పైసలు రాక రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయ, ఉద్యోగులందరినీ రోడ్డుపైకి ఎక్కిస్తానని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి మోదీ చేసిన అభివృద్ధి నినాదంతో ప్రజల్లోకి వెళ్లి గెలిచామని, అయినా మీరు ప్రజాతీర్పును కాలరాస్తే మా దమ్మేందో చూపిస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసినా 26సీట్లు దాటలేదని, మేయర్ సీటు కోరడానికి సిగ్గు లేదా అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాతీర్పును శిరసావహించకుండా మేయర్ పదవి కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ దిగజారి రాజకీయాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగిందని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏందో చూస్తారన్నారు. భాగ్యనగర్ ను మూడు ముక్కలు చేసి ఒకటి ఎంఐఎంకు రాసివ్వాలనుకుంటున్నారని, భాగ్యనగర్ సీఎం సొంత ఆస్తి కాదన్నారు. కరీంనగర్ కు నేనేం చేశానో, మోదీ ప్రభుత్వం ఏం చేసిందో బుక్ లెట్ తో సహా ప్రింట్ చేసి ఇంటింటికీ పంపించామని, ఎవరో ఏదో కూస్తే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇవ్వలేదని, కరీంనగర్ స్మార్ట్ సిటీ, ఇతర కేంద్ర నిధుల ద్వారా మొత్తం రూ.1400 కోట్లు వచ్చాయన్నారు. ఫలితాలపై స్పందిస్తూ బీజేపీలో అందరూ కష్టపడి పనిచేశారని, కొన్నిసార్లు ఫలితాలు రాకపోవచ్చు, అంత మాత్రాన ఇతరులు కష్టపడలేదని చెప్పడం సరికాదన్నారు. ఒకప్పుడు దేశంలో రెండే ఎంపీ సీట్లు ఉంటే... కేంద్రంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చామని, 2028లో తప్పనిసరిగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి తీరుతామన్న ధీమాను వ్యక్తం చేశారు. జీవం లేని పార్టీ ఎంఐఎం పునరుజ్జీవ ఉత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉందని సంజయ్ వ్యాఖ్యానించారు. రజాకార్లు పాకిస్తాన్ వెళుతూ ఎంఐఎం పార్టీని ఇక్కడ వదిలేసి వెళ్లారని, పునరుజ్జీవం అంటే రజాకార్ల పాలనను తీసుకొస్తారా?, తెలంగాణ ఆడబిడ్డలను బట్టలిప్పి బతుకమ్మ ఆడించాలనుకుంటున్నారా?, మజ్లిస్ పార్టీని ముస్లిం మహిళలే అసహ్యించుకుంటున్నారన్నారు. ట్రిపుల్ తలాఖ్ రద్దుతో ముస్లిం మహిళలంతా మోదీకి మద్దతిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో ముస్లిం మహిళలు బహిరంగంగానే కమలం పువ్వు పట్టుకుని బీజేపీకి సపోర్ట్ చేశారన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మొత్తం 66 డివిజన్లకు గాను బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. బీజేపీ 30 డివిజన్లలో గెలిచి అతిపెద్ద పార్టీగా నిలిచింది. కానీ స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి రాలేదు. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, ఎంఐఎం 3 డివిజన్ల చొప్పున గెలిచాయి. ఇండిపెండెంట్లు 8 సీట్లు గెలవగా, ఫార్వర్డ్ బ్లాక్ రెండు డివిజన్లలో గెలిచింది. బీజేపీ అతిపెద్ద పార్టీగా ఉన్నందున, ఇండిపెండెంట్లు మరియు చిన్న పార్టీల మద్దతుతో మేయర్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఎక్కువగా ఉంది.



## తెలంగాణ నేలకు పాదాభివందనాలు

**ఒకటితో ఆదరించారు.. లేలేత అడుగులతో మొదలయ్యాం**

**జనసేన అధినేత పవన్ కల్యాణ్ భావోద్వేగం**

**విజయవాడ, మహా:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణలో ఉద్భవించిన పార్టీ జనసేన. ఈరోజు విజయలక్ష్మి రూపంలో తొలి అడుగుపడింది. పార్టీ తొలినాళ్ళు గుర్తు చేసుకుంటే దారంతా గతుకులు.. భవిష్యత్తు ఏమిటనే ప్రశ్న. చిన్నపాటి ఆసరా కూడా లేదు. మిణుకుమిణుకుమనే ఆశ. పార్టీ సిద్ధాంతాలను విశ్వసించిన వీర మహిళలు ఝాన్సీ లక్ష్మీభాయి స్ఫూర్తిని నింపుకొని.. ఉద్యమ స్ఫూర్తితో జనసైనికులు ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకొనేందుకు సంసిద్ధులయ్యారు. తెలంగాణలోని వీర మహిళలు, జనసైనికులు పురపాలక ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. 2998 స్థానాలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనసేన 332 చోట్ల పోటీ చేసింది. ఒక కౌన్సిలర్ స్థానం, ఒక కార్పొరేటర్ స్థానం జనసేనకు దక్కాయి. మహా వృక్షమైనా చిన్న విత్తు నుంచే నేల పొరలను చీల్చుకొని మొలక వేస్తుంది. విశ్వ విజేత కూడా తల్లి గర్భంలో అణువంతే ఉంటాడు. కోటి రతనాల వీణ తెలంగాణలో జనసేన విజయ ప్రయాణం లేలేత అడుగులతో మొదలైంది. నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఆరూరి విజయలక్ష్మి, మంచిర్యాల కార్పొరేషన్‌లో అగ్గు సాగర్ జనసేన అభ్యర్థులుగా సాధించిన విజయాలు భవిష్యత్తు ప్రస్థానానికి బలమైన స్ఫూర్తిని అందిస్తాయి. విజయలక్ష్మి, సాగర్ లకు మన స్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. జనసేన తెలంగాణ వీర మహిళలు, జనసేన సైనికులు, నాయకులకు అభినందనలు. పార్టీ ఉద్భవించిన నేలపై దక్కిన తొలి విజయం ఇది. పోరాట పటిమను.. సంస్కృతి సంప్రదాయాల శక్తిని.. సాహితీ సౌరభాన్ని.. అణువణువునా నింపుకున్న తెలంగాణ నేల తల్లికి హృదయపూర్వక పాదాభివందనాలు' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సీపీఐ- కాంగ్రెస్ చెరి రెండున్నరేళ్ళు

- మేయర్ పదవిపై కుదిరిన అవగాహన
- మొదటి రెండున్నరేళ్లు సీపీఐకి మేయర్, కాంగ్రెస్ డిప్యూటీ మేయర్ పదవి
- సీఎంను కలిసిన సీపీఐ నేతలు.. పీసీసీ చీఫ్ సమక్షంలో ఒప్పందం
- కాంగ్రెస్, సీపీఐ మధ్య మొదట్నుంచి స్నేహబంధం : పీసీసీ అధ్యక్షుడు

**హైదరాబాద్:** కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఉత్కంఠ వీడింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్ రెడ్డి సమావేశం కావడంతో ఉత్కంఠకు తెరపడింది. కొత్తగూడెం కార్పొరేషన్ అంశంపై చర్చించిన నేతలిద్దరూ ఓ అంగీకారానికి వచ్చారు. మేయర్ పోస్ట్ చెరి రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. తొలి రెండున్నరేళ్ళు సీపీఐ మేయర్, కాంగ్రెస్ డిప్యూటీ మేయర్, తర్వాత రెండున్నరేళ్ళు కాంగ్రెస్ కు మేయర్, సీపీఐకి డిప్యూటీ మేయర్ ఇవ్వాలని అవగాహనకు వచ్చారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ అంశం ఓ కొలిక్కి వచ్చింది. కాగా, ఈ కార్పొరేషన్‌లోని 60 డివిజన్లకు ఈనెల 11న ఎన్నికలు జరగ్గా.. 13న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆర్ఎస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు.

**కలిసి సాగుతాం- సీపీఐ నేత వెంకటరెడ్డి**

కాంగ్రెస్, సీపీఐ మధ్య మొదట్నుంచి స్నేహబంధం ఉందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేశరాజకీయాల దృష్ట్యా కాంగ్రెస్‌తో కలిసి నడుస్తామని సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. ఒకటి రెండు సీట్లలో ఇబ్బందుల వల్ల పోటీచేయాల్సి వచ్చిందన్నారు.

## తోకపార్టీలకే బీఆర్ఎస్ తోకపార్టీగా మారింది

**సీపీఐ అడగకుండానే ఓపెన్ ఆఫర్ ఇవ్వడమేంటి?.. మీడియా మీట్ లో కవిత ఫైర్**

**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయవంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ దిశగా తెలంగాణ ఆర్టీసీ అడుగులు

**ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో దేశంలోనే తెలంగాణ ఆర్టీసీ రికార్డ్**

**హైదరాబాద్, మహా :** నగర వాసులను అనారోగ్యానికి గురి చేసే వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్ లో కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఇప్పుడు సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే 'రెట్రో ఫిట్మెంట్' సాంకేతికతపై ఎండీ నాగిరెడ్డి దృష్టి సారించారు. ఇందులో భాగంగా 'రెట్రో ఫిట్మెంట్' కోసం 15 సెప్టెంబర్ 2025 న టెండర్లు పిలిచి అదే నెల 30 న టెండర్ ప్రక్రియను ముగించి సాయి గ్రీన్ మొబిలిటీ సంస్థకు 200, కల్యాణి పవర్ ట్రైన్ లిమిటెడ్ కు 40 బస్సు లను 'రెట్రో ఫిట్మెంట్' చేసే బాధ్యతను ఆర్టీసీ అప్పగించింది. 2027 నాటికి హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గి ప్రజా రవాణా పెరగడంతో కాలుష్యం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు తగ్గి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని ఆరు డిపోల పరిధిలో 325 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, ఈ ఏడాదిలో మరో 175 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. రాబోయే బస్సుల కోసం అదనంగా 19 డిపోలలో చార్జింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా 10 డిపోలు, 10 చార్జింగ్ కేంద్రాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మౌలిక సదుపాయాల కోసం సుమారు 392 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా.

**సక్సెస్ అయిన ముషీరాబాద్ ప్రయోగం**

2023లోనే ముషీరాబాద్ డిపోకు చెందిన ఒక డీజిల్ బస్సును ప్రైవేటు సంస్థ సహకారంతో ఎలక్ట్రిక్ బస్సుగా మార్చారు. ప్రస్తుతం ఈ బస్సు ఉప్పల్ డిపో పరిధిలో విజయవంతంగా నడుస్తోంది. హైదరాబాద్ భవిష్యత్తు కోసం తీసుకొస్తున్న ఈ హరిత ప్రయాణాన్ని ప్రజలు ఆదరించాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి కోరారు. నగర ప్రజా రవాణా రూపురేఖలను మార్చే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బస్ భవన్ లో జరిగిన ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, విజయపుష్ప సాయి గ్రీన్ మొబిలిటీ, కల్యాణీ పవర్ ట్రైన్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రోడ్లు.. ఆదివారం టెర్రర్

**ట్రాఫిక్ పోలీసుల అధ్యయనంలో ఆందోళనకరమైన అంశాలు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగర రహదారులు మృత్యుకూపాలుగా మారుతున్న తీరుపై ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తాజా అధ్యయనం అత్యంత ఆందోళనకరమైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చింది. గతేడాది నగరంలో నమోదైన 2,801 ప్రమాద కేసులను విశ్లేషించినప్పుడు, వాహనదారుల మానసిక స్థితి మరియు ప్రయాణ సమయాలకు ప్రమాదాలకు మధ్య ఉన్న విడదీయలేని సంబంధం స్పష్టమవుతోంది. రహదారులు ఖాళీగా కనిపించగానే వేగాన్ని నియంత్రించలేకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కనీస నిబంధనలు పాటించకుండా దూసుకెళ్లడం వంటి అంశాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం, వారంలో అన్ని రోజుల కంటే ఆదివారం (448 కేసులు) సోమవారం (433 కేసులు) అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్టు నిర్ధారించారు. ముఖ్యంగా వారాంతాల్లో మద్యం మత్తులో వాహనాలు నడపడం, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కేవలం రాత్రి వేళల్లోనే కాకుండా, ఉదయం మరియు మధ్యాహ్న సమయాల్లో కూడా ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉండటం గమనార్హం. పోలీసుల నివేదిక ప్రకారం, ప్రమాదాల వివరాలు: ఆదివారం: 448 సోమవారం: 433 మంగళవారం: 413 బుధవారం: 371 గురువారం: 356 శుక్రవారం: 372 శనివారం: 408 గా క్షేత్రస్థాయిలో పోలీసులు జరిపిన దర్యాప్తులో మృతుల్లో మరియు క్షతగాత్రుల్లో ద్విచక్ర వాహనదారులే అధికంగా ఉన్నట్లు తేలింది. ఖాళీగా ఉన్న రోడ్లపై వేగాన్ని నియంత్రించలేక వాహనాలు ఢీకొంటున్నారు. రెడ్ సిగ్నల్ పడినా ఆగకుండా దూసుకెళ్లడం వల్ల కూడళ్ల వద్ద ఘోరాలు జరుగుతున్నాయి. వారాంతాల్లో 'కిక్' కోసం తాగి బండి నడపడం మృత్యువును ఆహ్వానించడమే అవుతోంది. బహదూర్‌పుర ఫ్లైఓవర్ వంటి ఘటనల్లో మైనర్లు వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోంది. రాంగ్ రూట్, గల్లీల నుంచి ఒక్కసారిగా మెయిన్ రోడ్డుపైకి రావడం ప్రమాదాలకు దారితీస్తోంది. పెరుగుతున్న ఈ మరణాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం 'ఎరైవ్ ఎలైవ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.

# బెల్లంపల్లి బల్దియా పీఠంపై గులాబీ జెండా ఎగిరేనా!

### చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య .. చేతులెత్తేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి మహా:** రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉందని అతి విశ్వాసంతో బెల్లంపల్లికి జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ కి కోలుకోలేని దెబ్బ తగిలినట్లు అయింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలను ప్రధాన పార్టీలైన టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని బల్దియా పీఠాన్ని కైవసం చేసుకునేందుకు శాయశక్తుల ప్రయత్నించారు.బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య జరిగిన మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అంతా తానై అన్ని వార్డులలో తిరిగి ప్రచారాన్ని కొనసాగించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంలో సఫలీకృతమయ్యారు. దీంతో ఈ ఎన్నికల్లో బెల్లంపల్లి బల్దియాలో 34 వార్డులు ఉండగా బిఆర్ఎస్ పార్టీకి 14 వార్డు సభ్యులను ప్రజలు అధికారానికి ఇవ్వగా నైతిక విజయం తమదేనని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇదివరకే స్పష్టం చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో మరో 14 వార్డులను కాంగ్రెస్ పార్టీ హస్త గతం చేసుకుంది కానీ చైర్ పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు మ్యాజిక్ ఫిగర్ కు 18 వార్డు సభ్యులు కావాల్సిఉండగా అధికార కాంగ్రెస్ పార్టీకి 14 డిఆర్ఎస్ పార్టీకి మరో 14 వార్డుసభ్యులను విజయాన్ని వరించాయి .దీంతో చైర్ పర్సన్ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు ఈ ఎన్నికల్లో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్ స్థానాన్ని సంబంధిత అధికార ప్రతిపక్ష పార్టీలో కైవసం చేసుకునేందుకు




కీలకంగా మారారు దీంతో ఆత్మ రక్షణలో పడిన అధికార కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో అంటీ ముట్టనట్లు వ్యవహరించడంతో ఇదే అదునుగా తీసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వ్యూహాత్మకంగా పావులు కలిపిస్వతంత్రులను తమ వైపు తిప్పుకోవడంలో సఫలీకృతమయ్యారు. దీంతో ఈనెల 16న జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ కు చేరువైనట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ 14 స్థానాలు కైవసం చేసుకోగా ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో కౌన్సిలర్ తోపాటు బిజెపి పార్టీకి చెందిన కౌన్సిలర్లను లను సైతం తమ పార్టీ అధినాయకత్వంతో ఫలితాలు వెలువడిన రోజు సాయంత్రమే హైదరాబాద్ క్యాంపుకు తరలించి బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో గులాబి కండువా కప్పి తమ బలాన్ని నిరూపించుకున్నారు.దీంతో 17 మంది సంఖ్యకు చేరుకోగా స్వతంత్ర అభ్యర్థి పోలు ఉమాదేవి శ్రీనివాస్ సైతం బిఆర్ఎస్ పార్టీకి రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి ఉన్నాడూ. దీంతో ఆయన సైతం బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ప్రకటించిన్నట్లు తెలిసింది. దీంతో మ్యాజిక్ ఫిగర్ కు బిఆర్ఎస్ పార్టీ చేరుకోవడంతో బిఆర్ఎస్ పార్టీ బల్దియా పీఠంపై బెల్లంపల్లి బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయంగా కనిపిస్తుంది. బెల్లంపల్లిలో ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ తోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సైతం స్వతంత్ర అభ్యర్థులను తమ వైపు తిప్పుకోవడంలో విఫలమయ్యారనే ప్రచారం ఆ పార్టీలోనే వినిపిస్తున్నది. ఒకవేళ బెల్లంపెల్లి బల్దియా పీఠం హస్తం చేజారితే దీనికి పూర్తి బాధ్యత బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డంవినోద్ వహించాల్సి వస్తుందని పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే తమ వైఖరిని స్పష్టం చేశారు ఏది ఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీసంచలన విజయాలను సొంతం చేసుకున్న ప్పటికీ బెల్లంపల్లి పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీకి చేజారి పోతుందని చర్చ సర్వత్రా కొనసాగుతున్నది.జరిగిన ఎన్నికల్లోఅధికార కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను దక్కించుకోగా బెల్లంపల్లిలో మాత్రం బిఆర్ఎస్ వశం కానుండడంతో హస్తం పార్టీ శ్రేణుల్లో నైరాష్యం నెలకొంది. ఇరు పార్టీలకు చెందిన వార్డు సభ్యులను ఇదివరకే క్యాంపు రాజకీయాలకు తరలించగా ఈనెల 16వతేదీన చైర్మన్ మున్సిపల్ చైర్మన్ ఎంపిక జరగనుండడంతో బిఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నేతల్లోనూ ఉత్కంఠత నెలకొంది.

## బెల్లంపల్లి బల్దియాలో చైర్మన్ స్థానంకై
# బీఆర్ఎస్ వ్యూహరచన

- బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు కౌన్సిలర్లు
- బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో చేరిక

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. టిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు మ్యాజిక్ ఫిగర్ ను సాధించే దిశలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ నుండి టిఆర్ఎస్ పార్టీలో కేటీఆర్ సమక్షంలో శనివారం నాడు హైదరాబాద్ లో చేరడం జరిగింది. కేటీఆర్ సమక్షంలో శనివారం రోజు హైదరాబాదు క్యాంపుకు తరలి వెళ్లిన స్వతంత్ర అభ్యర్థి సుకేసిని భరద్వాజ్ తో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన కుమారస్వామి బి ఆర్ ఎస్ బిజెపి పార్టీ నుండి గెలిచిన రామ్మూర్తి లు కేటీఆర్ సమక్షంలో పార్టీ కండువాను కప్పుకోవడం చర్చనీయాంశమైంది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా 14 వార్డులు టిఆర్ఎస్ 14 వార్డులు కాంగ్రెస్ ఐదుగురు స్వతంత్రులు ఒక బీజేపీ పార్టీకి చెందిన వార్డు సభ్యులుగా గెలుపొందారు. బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకునేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 18 మంది వార్డు సభ్యులు అవసరం ఉండగా ఇప్పటికే తమ పార్టీకి చెందిన 14 మందిని క్యాంపర్ ఒక తరలించిన టిఆర్ఎస్ మరో ముగ్గురిని చేర్చుకోవడంతో సంఖ్యాబలం 17 చేరుకుంది అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థి మరోకరు సైతం టిఆర్ఎస్ పార్టీకి



మద్దతిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది.బెల్లంపల్లికి చెందిన పలువురు కౌన్సిలర్లు శనివారం నాడు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ సుకేశిని భరద్వాజ్ తోపాటు, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 26వ వార్డు కౌన్సిలర్ కుమారస్వామి అధికారికంగా బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. వీరితో పాటు బీజేపీకి చెందిన 34వ వార్డు అభ్యర్థి రామూర్తి కూడా కేటీఆర్‌ను కలిశారు. ఆయన ప్రస్తుతానికి పార్టీలో అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితులై పార్టీకి పూర్తి స్థాయి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ చేరికతో బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ సంఖ్యా బలం 17 కు చేరుకుంది. మ్యాజిక్ ఫిగర్లు 18 చేరుకునేందుకు మరొక అభ్యర్థి అవసరం ఉండగా స్వతంత్ర అభ్యర్థి ఒకరు తమకే మద్దతిస్తున్నట్లు ప్రచారం కొనసాగుతున్నాయి ఏది ఏమైనప్పటికీ ఈనెల 16వ తేదీన చైర్మన్ స్థానం ఎంపిక కానుండడంతో బెల్లంపల్లి మున్సిపాలిటీ గులాబీ వశం అవుతుందనే చర్చ సర్వత్ర కొనసాగుతున్నది




## బెల్లంపల్లిలో ఘనంగా బాడీ బిల్డింగ్ పోటీలు

### .. ఛాంపియన్ గా లక్ష్మణ్

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణం లోని స్కై జిమ్ ఆధ్వర్యంలో సింగరేణి కళావేదికలో సింగరేణి క్లాసిక్ బాడీ బిల్డింగ్ పోటీలు ఘనంగా జరిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్,ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఖమ్మం,ఉమ్మడి వరంగల్ స్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో ఛాంపియన్ గా గుండలక్ష్మణ్ (స్కై జిమ్ బెల్లంపల్లి) టైటిల్ సాధించారు. జూనియర్ ఛాంపియన్ గా కొలిపాక నితీష్ (సి సి సి ), బెల్లంపల్లి ఛాంపియన్ గా లక్ష్మణ్ టైటిల్ ను కైవసం చేసుకున్నారు.50 కిలోల విభాగంలో మునీష్,55 కిలోల విభాగం లో అనిల్,60 కిలోల విభాగంలో ఎం వెంకటేష్, 65 కిలోల విభాగంలో జి లక్ష్మణ్, 70 కిలోల విభాగంలో శిశిరుత్, 75 కిలోల విభాగంలో ముజామ్మి ఖాన్ 80 కిలోల విభాగంలో ఎన్ వెంకటేష్, 85 ప్లస్ విభాగంలో ఎండి సోయబ్ గెలుపొందారు. దాదాపు 100 మంది బాడీ బిల్డర్లు ఈ పోటీలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా మిస్టర్ ఇండియా రాజు,ఓరం సురేష్, నాగమల్లేశ్వరరావు, ఇంతియాజ్, శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అడిషనల్ ఎస్పీ రవికుమార్ జిమ్ నిర్వాహకులు పి.సదానందం,జె.చంద్రశేఖర్ జె. మురహరి రావు వెంకటేశ్వర్లు, గిరి ప్రసాద్, కుప్పిరాల విజయ్, మోబిన్ ఖాన్, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.వ్యాఖ్యాతగా కె.నగేష్ వ్యవహరించారు.

## 16న ఉచిత కంటి వైద్య శిబిరం

**ఆమనగల్లు, మహా :**లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ ఎం ఏ పాష తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఆర్ఓ పాషా తెలిపారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ లేదా రేషన్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

## బీజేపీలో చేరిన మరో ఇద్దరు ఇండిపెండెంట్ కార్పొరేటర్లు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో చేరిన 17, 39వ డివిజన్ కార్పొరేటర్లు
- కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించిన బండి సంజయ్
- బీజేపీతో సంప్రదింపులు చేస్తున్ మరో ఆరుగురు కార్పొరేటర్లు
- మేయర్ ఎన్నిక నాటికి బీజేపీ బలం అనూహ్యంగా పెరిగే అవకాశం

**కరీంనగర్ మహా:** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందిన ఇద్దరు కార్పొరేటర్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ ఈరోజు హైదరాబాద్ కు విచ్చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారిద్దరికీ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కాషాయ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నిన్న(శుక్రవారం) రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 1 ఇండిపెండెంట్, మరో ఏఐఎఫ్ బీ కార్పొరేటర్ కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ఇద్దరి చేరికతో బీజేపీ బలం 34కు చేరింది. ఎక్స్ అఫిషియో హోదాలో స్థానిక ఎంపీ బండి సంజయ్ కు కూడా ఒక ఓటు



ఉంటున్నందున మొత్తం బీజేపీ బలం 35కు చేరింది. వీరు గాకుండా మరో ఆరుగురు కార్పొరేటర్లు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయమైంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కు చెందిన కార్పొరేటర్లు, ఇండిపెండెంట్ కార్పొరేటర్లు బీజేపీలో చేరే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు. కరీంనగర్ లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి అధిక నిధులు వస్తుండటం, బీజేపీలో చేరితేనే తమ తమ డివిజన్ లో ఎక్కువ అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మరింత దగ్గర కావొచ్చనే భావనతో బీజేపీ ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనలో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కి నిధులు కేటాయించకపోవడం... రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం...వంటి అంశాలను దృష్టిలో ఉంచుకున్న ఆయా కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరితే పెద్దగా ఒరిగేదేమీ ఉండదనే అభిప్రాయానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరే కార్పొరేటర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## టీడీపీ సీనియర్ నేత పరంధామయ చారి కన్నుమూత

### భరత్ నగర్ కాలనీలోని ఆయన నివాసంలో నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు

**ఏ.ఎస్. రావు నగర్, మహా:** డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ భరత్ నగర్ కాలనీకి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత కనకమోజు పరంధామయ చారి శనివారం కన్నుమూశారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న రాజకీయ ప్రముఖులు మరియు పార్టీ ముఖ్య నేతలు భరత్ నగర్ కాలనీలోని ఆయన నివాసానికి చేరుకుని, భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పరంధామయ చారి పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నియోజకవర్గంలో పార్టీకి ఆయన ఒక పిల్లర్ లా ఉండేవారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో:మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ





అధ్యక్షులు కేశేటి ప్రసాద్, సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, శేరి మణెమ్మ, లక్ష్మి నారాయణ పాకాల రాజన్న, రాములు యాదవ్, సతీష్ బాబు, పత్తి కుమార్, అల్లురయ్య, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సింగం కిరణ్, సందీప్ గౌడ్, అనిల్, నర్సింహా, ప్రకాష్, మామిడి శ్రీనివాస్, రాజేష్, కొండలు యక్కయ్య, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



## ఉచిత వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభం

**బెల్లంపల్లి, మహా :**బెల్లంపల్లి ఏరియా మాదారం టౌన్ షిప్ లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత మగ్గం , స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర్ రెడ్డి మరియు సేవా సమితి అధ్యక్షురాలు ఎం పద్మ విజయ భాస్కర్ రెడ్డి లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి లాంటి గొప్ప వ్యవస్థ మరొకటి లేదన్నారు. ఉద్యోగులకే కాకుండా ప్రభావిత ప్రాంత ప్రజలకు కూడా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.మహిళలుస్వశక్తి తో ఎదిగేందుకు వృత్తిశిక్షణ లైన జూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీసియన్, డ్రైవింగ్ శిక్షణలు ఇప్పిస్తుందన్నారు. శిక్షణలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా కుటుంబానికి బాసటగా నిలవాలని కోరారు.సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఎం పద్మ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మార్కెట్ డిమాండుకు తగ్గట్టుగా ఉత్పత్తులు తయారు చేసేలా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు ఉజ్వల్ కుమార్ బెహార, నళిని నరేందర్ , పర్సనల్ హెచ్ ఓ డి ఎం శ్రీనివాస్ , సీనియర్ పర్సనల్ అధికారి డి ప్రశాంత్ , శిక్షకులు చంద్రకళ , శైలజ తదితరులు పాల్గొన్నారు.

### మొయినాబాద్‌లో
# చైర్మన్ కుర్చీ కోసం రాజకీయ కిడ్నాప్?

- హంగ్ ఫలితాల తర్వాత అడ్డదారి రాజకీయాలు ఆరోపణ
- బీఆర్ఎస్ నాయకుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన నేపథ్యంలో చైర్మన్ పదవి కోసం రాజకీయ పావులు కదులుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో అడ్డదారులు తొక్కుతోందని బీఆర్ఎస్ నాయకుడు అల్లం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు.చైర్మన్ కుర్చీ కోసం బీఆర్ఎస్ నుండి గెలిచిన కౌన్సిలర్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ నాయకులు తమ వైపు తిప్పుకునేందుకు 'కిడ్నాప్ రాజకీయాలు' ప్రారంభించారని మండిపడ్డారు."ఇది రాజకీయ ఆకర్షణ కాదు...ఇది ప్రజాస్వామ్యాన్ని బందీ చేయడం" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

**ప్రజల తీర్పుని దొంగిలించే కుట్ర!**


"ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా కాంగ్రెస్‌ను తిరస్కరించి బీఆర్ఎస్‌ను గెలిపించారు. అయినా చైర్మన్ సీటు కోసం సిగ్గులేకుండా మా కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇది ఓటర్ల గౌరవాన్ని అవమానించడం" అని అల్లం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్‌లో తీవ్ర అన్యాయం జరుగుతుండటంతోనే తాను బీఆర్ఎస్‌లో చేరానని గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే అన్యాయ రాజకీయాలు మొయినాబాద్‌లో బయటపడుతున్నాయని విమర్శించారు.

**ఎమ్మెల్యే కాలే యాదయ్య ఎక్కడ?**

ముఖ్యంగా ఇటీవల స్పీకర్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని స్పష్టం చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య పాత్రపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు."బీఆర్ఎస్ అభ్యర్థులను ఇలా కిడ్నప్ చేస్తుంటే కాలే యాదయ్య ఎక్కడ ఉన్నారు? పార్టీ తరఫున స్పందన ఎందుకు లేదు?" అని ప్రశ్నించారు.మొయినాబాద్ రాజకీయాల్లో ఈ ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. చైర్మన్ ఎన్నికల ముందు చోటుచేసుకున్న ఈ పరిణామం స్థానిక రాజకీయాలను అగ్గిపెట్టెలా మారుస్తోంది.

# పవిత్రం.. ప్రత్యేకం

### నిష్టతో ఉపవాస దీక్షలు.. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మసీదులు
### ఇఫ్తార్ విందులలో గంగాజమున తెహజీబ్





**ఆమనగల్లు, మహా:** ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం గురువారం ప్రారంభం కానుంది . ఉపవాస దీక్ష లో భాగంగా ముస్లింలు సూర్యోదయానికి ముందు పానీయాలు తీసుకుని సూర్యాస్తమం తర్వాత ప్రార్థన చేసిన అనంతరం తిరిగి ఆహారం తీసుకుంటారు. ఈ మధ్యలో లాలాజలం కూడా జీర్ణాశయంలోని పోనివ్వకుండా జాగ్రత్తపడతారు. ఈసారి ఎండల్లోనే ఉపవాస దీక్షలు జరుగనున్నాయి. చంద్రమాసాన్ని అనుసరించి ఇస్లాం క్యాలెండర్ ప్రకారం రంజాన్ను లెక్కిస్తారు. అందుకే నెలవంక కనిపించిన వెంటనే రంజాన్ ప్రారంభమవుతుంది. రంజాన్ సందర్భంగా ముస్లింలు నెల రోజులు నిష్ఠతో ఉపవాస దీక్ష చేస్తారు. వేకువ జామున స్నానాలు ముగించుకొని ఆహారం తీసుకుంటారు. తర్వాత ఫజర్ నమాజ్ చేసి ఉపవాస దీక్షలు మొదలుపెడతారు. రోజంతా ఉపవాసం ఉండి రాత్రి ఈష నమాజ్ ముందు ఖర్జూరాలతో దీక్షను విరమిస్తారు. రోజుకు ఐదుసార్లు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేస్తారు. కాగా రంజాన్ సందర్భంగా మసీదులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

### దానధర్మాలకు ప్రాధాన్యం

రంజాన్ మాసంలో పేదలకు తమకు తోచిన సాయం చేస్తారు. ఈ మాసంలో పేదలకు డబ్బులు, ఆహారం, దుస్తులు. ఇతరత్రా వాటిని అందిస్తారు. తాము అర్జించిన ఆదాయంలో కొంత మేరకు పేదలకు ఆదుకోవడానికి వినియోగిస్తారు. దీనిని జాకాత్ అంటారు. అభాగ్యులకు పండుగ సందర్భంగా రోజాలో ఉన్న వారికి పండ్లు ఫలహారాలు సమకూర్చుతారు.

### నోరూరించే హలీం..

రంజాన్ నెల అనగానే రుచికరమైన హలీం అందరికీ జ్ఞాపకం వస్తుంది. ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలు పొట్టేలు మాంసం, చికెన్ తో చేసే హలీం తినేందుకు ఆసక్తి చూపుతారు. ఉపవాసదీక్షతో శక్తిని కోల్పోయిన దీక్షదారుల్లో శక్తిని హాలీం నింపుతుందని భావిస్తారు. హాలీం ను హిందువులు, ముస్లింలు తేడాలేకుండా తింటారు.

### ఇఫ్తార్ జోరు

రంజాన్ నెల అనగానే ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షల తరువాత జ్ఞాపకం వచ్చేది ఇఫ్తార్ విందులే, రంజాన్లో ఉపవాస దీక్ష చేసిన ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడానికి భక్తులు పోటీ పడుతారు. సాయంత్రం ప్రార్థనలు చేసి ఉపవాస దీక్ష విరమించిన వారికి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడంలో ముస్లింలతో పాటు హిందువులు ముందుంటారు. కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి గంగాజమున తెహజీబ్ను గుర్తుకు తెస్తారు. ఇఫ్తార్ తర్వాత మసీదుల్లో తరావీహ్ ప్రార్థనలు జరుగుతాయి.రంజాన్ పవిత్రంగా కొలుస్తారు ముస్లింలు రంజాన్ ను పవిత్రంగా కొలుస్తారు. ఐదుసార్లు నమాజు రెండు సార్లు ప్రత్యేక ప్రార్థనలు చేయాల్సి ఉంటుంది.

### పఠనానికి ప్రాధాన్యం

ఖురాన్ పఠణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పూర్తిగా నిష్టతో రంజాన్ ప్రాముఖ్యతను అందరూ విధిగా పాటించాలి. పవిత్ర మాసం రంజాన్ ఉపవాసాలు అందరూ విజయవంతంగా పూర్తి చేయాలి. నెల రోజుల పాటు జరిగే రంజాన్ ఉపవాసదీక్షలకు సహకరించాలి..

### దైవ చింతనలో గడపాలి

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం దైవ చింతనలో గడపాలి. రోజు నమాజ్ కచ్చితంగా ఆచరించాలి. ఉపవాసాలు చేసేవారు. వ్యసనాలకు దూరంగా ఉండాలి.

....మౌలానా అబ్దుల్ కరీం

## భక్తి ముందు ఇరుముడి భారం ఎంత?

- అతి చిన్న వయసులో శివదీక్ష తీసుకొని శ్రీశైలం వెళ్ళిన చిన్నోడు
- ఇరుముడితో చిన్నారిని చూసి భక్తి భావంతో సంబుర పడిన ప్రజలు

**సంగారెడ్డి ప్రతినిధి: మహా :** సదాశివపేట పట్టణంలోని షెడ్డి వినోద్ ,శ్వేత దంపతుల కుమారుడు చిన్నారి హరిహరన్ (4) అతి చిన్న వయసులో శివదీక్ష తీసుకొని అందరిని ఆకట్టుకుంటున్నాడు. 41 రోజులపాటు కఠోరమైన శివదీక్ష నియమాలు పాటించి శనివారం దీక్ష ఇరుముడిని కట్టుకొని శ్రీశైల పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్ళాడు. చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లు చూస్తూ కాలక్షేపంతో చదువును నిర్లక్ష్యం చేస్తున్న ఈ రోజుల్లో నాలుగు సంవత్సరాల అతి చిన్న వయసులో తల్లిదండ్రుల మాట బుద్ధిగా వింటూ 41 రోజు ప్లాటు శివదీక్ష చేపట్టి కఠినమైన నియమాలు పాటించి దీక్ష పూర్తి చేసిన హరిహరన్ ఇరుముడి నెత్తిన పెట్టుకొని శ్రీశైలానికి వెళ్లడం చూసిన భక్తులు అందరూ భక్తి భావంతో పులకించిపోయారు. చిన్నారి హరిహరన్ ముద్దు ముద్దు మాటలు... మాట్లాడుతూ ఓం నమశ్శివాయ నామస్మరణతో శ్రీశైల మల్లికార్జునుని దర్శనం కోసం బయలుదేరి వెళ్లడం పట్టణంలో చర్చనీయాంశమైంది. చిన్నారి హరిహరన్ శివ దీక్ష అలంకరణలో చూసిన ప్రజలంతా భక్తి భావంతో సంబర పడడం కనిపించింది.

## సర్పంచ్ సొంత డబ్బులతో గ్రామానికి ముఖద్వారం

### మిలిగిరి పేట్ సర్పంచ్ షాబుద్దీన్

**సంగారెడ్డి ప్రతినిధి :మహా :** సదాశివపేట మండలంలోని మిలగిరి పేట గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ తన సొంత డబ్బులతో గ్రామానికి ముఖద్వారం నిర్మింప చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ గ్రామానికి వచ్చేవారికి బోర్డు లేకపోవడం వల్ల ఇబ్బంది కలుగుతుందని కాబట్టి తన సొంత డబ్బులతో గ్రామానికి ముఖద్వారం నిర్మింప చేయడం జరిగిందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి మరియు టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో నిధులు తీసుకొచ్చి గ్రామంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానన్నారు.శనివారం గ్రామ ముఖద్వారం సర్పంచ్ షాబుద్దీన్ చేతుల మీదుగా




ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డ్ మెంబర్లు నరసింహారెడ్డి, శ్రీనివాస్, యాదుల్, పెంటయ్య, పంచాయతీ కార్యదర్శి రాములు, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుభాన్ రెడ్డి, సంజీవరెడ్డి, రియాజ్, మహేందర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, టేకురి కిష్టయ్య, రత్నయ్య, మల్లేశం, సంగయ్య, చంద్రయ్య, ప్రభు, నగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## శివరాత్రికి ముస్తాబైన బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం

- భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టిసి బస్సులో ఏర్పాటు
- అంగరంగ వైభవంగా ముస్తాబైన బుగ్గ దేవాలయం

**బెల్లంపల్లి, మహా:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ శివారులోని బుగ్గ రాజా రాజేశ్వర స్వామి ఆలయాన్ని దేవాలయ శాఖ సన్నాహాలను పూర్తి చేసింది .ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాల అలంకరణను పూర్తి చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న బుగ్గ రాజ రాజేశ్వర స్వామి ఆలయానికి టీజీఎస్ఆర్టిసి బెల్లంపల్లి పాత బస్టాండ్ నుండి బస్సులను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసింది. అత్యవసర సేవలకు గాను వైద్యశాఖ సైతం సిబ్బందిని ఏర్పాటు చేయగా బెల్లంపల్లి ఎంపీడీవోతోపాటు తాండూర్ ఎంపీడీవో ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులను సన్నద్ధం చేశారు శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రాను ఉండడంతో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేయడం పోలీసు సిబ్బందిని సైతం పెద్ద సంఖ్యలో కేటాయించారు. ఆదివారం రోజు శివరాత్రి మహోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ సైతం పాల్గొననున్నారు మూడు రోజులపాటు వేడుకలు జరగనున్నందున దేవాదాయ శాఖ అన్ని హంగులను పూర్తి చేసింది ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి బాపురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్దూడల మహేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సైతం వేడుకల్లో పాల్గొననున్నారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు..

**రాజేంద్రనగర్, మహా :** ఢిల్లి నుండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్స్.శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో సేఫ్‌గా ల్యాండింగ్ చేసిన పైలట్. బాంబ్స్ క్యాడ్స్ డాగ్స్ కార్డులతో విమానంలో తనిఖీలు నిర్వహించగా అనుమానిత బొమ్మలభ్యమయింది. ప్రయాణికులు మర్చిపోయిన బోమ్మగా తేల్చేన సెక్యూరిటీ అధికారులు. బాంబు బెదిరింపును ఫెక్‌గా తేల్చిన సెక్యూరిటీ అధికారులు ఊపిరిపీల్చుకున్నా ప్రయాణికులు.


## మారుతున్న రాజకీయ సమీకరణాలు

### చైర్మన్ లోకల్ నాన్ లోకల్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పట్నం మున్సిపాలిటీలో జరిగిన కౌన్సిలర్ ఎన్నికలలో మెజార్టీ స్థానాలను టిఆర్ఎస్ పార్టీ గెలుచుకోవడం జరిగింది. అధికార పార్టీ కాంగ్రెస్ రెండవ స్థానంతో సరి పెట్టుకుంది. దీంతో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ పీఠం జనరల్ స్థానం కావడంతో బీసీ నినాదం తెరపైకి వచ్చింది. చైర్మన్ కాయమనుకున్న తరుణంలో... బిఆర్ఎస్ పార్టీ చైర్మన్ కాయం అనుకున్న తరుణంలో బిఆర్ఎస్ బీసీ నినాదం, లోకల్ నినాదం తెరపైకి రావడంతో గందరగోళంతో ఏమి చేయాలని సమాలోచనలు నాయకులు పడ్డారు.. ఇబ్రహీంపట్నంలో 24 వార్డులు ఉండగా అందులో 19 ఇబ్రహీంపట్నం కేంద్రానికి చెందినవి కావడం, మరొక ఐదు వార్డులు శేరిగూడ, ఖానాపూర్, సీతారాంపేట్ గ్రామాలలో ఉండడంతో లోకల్ నినాదం తెరపైకి వచ్చింది. 19 వార్డులు ఉన్న ఇబ్రహీంపట్నంకు చైర్మన్ పదవి




ఇవ్వాలంటూ బిఆర్ఎస్ క్యాంపులో లుకలుకలు మొదలవడం జరిగిందని విశ్వసనీయ సమాచారం. చైర్మన్ అభ్యర్థి ఖాయం అని ఇచ్చిన మాట నిలబడుతుందా, లేదా నేను లోకల్ అనే నినాదానికి చైర్మన్ పదవి వస్తుందా వేచి చూడాలి.



సోమనాథ్ ఆలయం



లింగరాజ దేవాలయం



తీర దేవాలయం

# శివోహం

## మహా శివరాత్రి.. మహా క్షేత్రాలు

(మహా ప్రత్యేకం)

శివుడు విశ్వ సృష్టికర్త.. విశ్వాన్ని సృష్టించిన ముగ్గురు ప్రధాన దేవుళ్ళలో ఒకరు. శివుడు శివలింగం, రుద్రాక్షతో సహా అనేక రూపాలలో పూజించబడతాడు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో.. కృష్ణ పక్ష చతుర్దశి తిథిలో మహాశివరాత్రి వస్తుంది. మహాశివరాత్రి పురస్కరించుకుని దేశంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగుతున్నాయి రెండు తెలుగు రాష్ట్రాలలో మహాశివరాత్రి వేడుకలు కన్నుల పండుగగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం శివరాత్రి మహా పర్వదినం వచ్చిందంటే చాలు ఊరూర వెలసిన శివక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడిపోతాయి. వందలు, వేల సంఖ్యలో భక్తులు పొద్దంతా ఉపవాసాలు ఉండి, సాయంకాలం నుండి రాత్రిళ్లు పొద్దు పోయేదాకా ఈశ్వరుని ఆరాధనలలో మునిగిపోతారు. రాత్రంత జాగారం చేసే వారు మరెందరో. దేశవ్యాప్తంగా ఆ రోజు శైవ దేవాలయాలన్నీ ప్రత్యేక అర్చనలు, సేవలు, అభిషేకాలతో కన్నులపండువ చేస్తాయి. ఈ సందర్భంగా భక్తియాత్ర చేద్దామనుకునే వారి కోసం తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన శివక్షేత్రాల దర్శనార్థం శివరాత్రి సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ, ఎపిఎస్ఆర్టిసితోపాటు ప్రైవేట్ టూరిస్టు సంస్థలు కూడా ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్ సౌకర్యాలను కల్పిస్తాయి. పండగ సందర్భంగా మహాక్షేత్రాలను దర్శించడం ఒక అపురూపమైన అనుభూతి. ఆరోజు గర్భగుడిలోకి ప్రవేశం లభించడమే గొప్ప. అక్కడ లింగరూపంలోని కైలాసనాధుని దర్శనం ఒక మహద్భాగ్యమే. ఈ సందర్భంగా ఎంతో ఓపిక ఉంటే తప్ప ఈ కార్యం నెరవేరదు. పరమ పవిత్రమైన శివరాత్రి పూట కోరుకున్న క్షేత్రంలో గడపాలనుకునే వారు తత్ సంబంధ శ్రమ, కష్టాలు, ఖర్చులకు ఓర్చుకోవాల్సి ఉంటుంది. మహాశివరాత్రి తెలంగాణలో శివుడు కొలువై ఉన్న ప్రముఖ శైవక్షేత్రాల విశేషాలను చూద్దాం రండి! తెలంగాణలో వేములవాడ రాజరాజేశ్వరాలయం, కాళేశ్వరం ముక్తీశ్వరాలయం, కొమురవెల్లి మల్లన్న ఆలయం వంటి ప్రసిద్ధ శైవక్షేత్రాలు ఆధ్యాత్మికతకు, శిల్పకళకు నిలయాలు. వేములవాడలో అద్భుతమైన కోడె మొక్కులు, రామప్ప వద్ద కాకతీయుల శిల్పకళ, కాళేశ్వరంలో రెండు లింగాలు (శివకేశవులు) ప్రధాన విశేషాలు.

### ప్రసిద్ధ శైవక్షేత్రాలు - వాటి ప్రత్యేకతలు:

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం (రాజన్న సిరిసిల్ల జిల్లా): తెలంగాణలోని అతి ముఖ్యమైన శైవక్షేత్రం. ఇక్కడ శివుడు రాజరాజేశ్వరుడిగా కొలువుదీరారు. భక్తులు తమ కోరికల కోసం "కోడె మొక్కు" (ఎద్దులను కట్టేయడం) చెల్లించడం ఇక్కడి ప్రధాన విశేషం. శివాలయంతో పాటు పార్వతీ దేవి ఆలయం, ఇక్కడ కొలువైన ఆదిశంకరాచార్యులు, మరియు దర్గా (భక్త కన్నప్ప) మతసామరస్యానికి ప్రతీక. కాళేశ్వర ముక్తీశ్వరాలయం (జయశంకర్ భూపాలపల్లి జిల్లా): కాళేశ్వరంలో రెండు శివలింగాలు (ముక్తీశ్వర, కాళేశ్వర) ఒకే పానవట్టంపై కొలువై ఉండటం, శివకేశవ భేదం లేదని చెప్పడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ సరస్వతీ దేవి ఆలయం కూడా ప్రసిద్ధి. రామప్ప ఆలయం (వరంగల్ ఘనపూర్): కాకతీయుల కాలం నాటి రామలింగేశ్వరుడి ఆలయం. అద్భుతమైన శిల్పకళ, తేలియాడే ఇటుకలతో నిర్మించిన గోపురం, ఇక్కడి ప్రత్యేకతలు. ఈ ఆలయం యునెస్కో గుర్తింపు పొందింది. కొమురవెల్లి మల్లన్న ఆలయం (సిద్దిపేట జిల్లా): శివుని అవతారమైన మల్లికార్జున స్వామిగా కొలువుదీరిన ఈ ఆలయం, భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధి. ఇక్కడి సంప్రదాయ పూజలు, జాతర విశేషం. వేయి స్తంభాల గుడి (హనుమకొండ): కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనం, రుద్రేశ్వరుడికి అంకితం చేయబడిన ఈ ఆలయం, దీని ప్రత్యేకత స్తంభాల అద్భుతమైన శిల్పకళ.



### భారతదేశంలో ప్రసిద్ధ శివాలయాలు

**సోమనాథ్ ఆలయం**
సోమనాథ్ మహాదేవ్ ఆలయం శివారాధనకు ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి. ఈ జ్యోతిర్లింగం చాలా పవిత్రమైన పుణ్యక్షేత్రం. ఆలయ సముదాయంలో ప్రతిరోజూ సాయంత్రం జరిగే సౌండ్ అండ్ లైట్ షో కూడా ఉంటుంది.

**లింగరాజ దేవాలయం**
ఈ ఆలయానికి శివుని లింగ రూపం పేరు పెట్టారు. ప్రతి శివభక్తుడు ఈ ఆలయాన్ని తప్పక సందర్శించాలి.

**తీర దేవాలయం**
మహాబలిపురంలోని స్మారక కట్టడాల సమూహాలలో ఒకటిగా, ఇది UNESCO ప్రపంచ వారసత్వ ప్రదేశంలో చేర్చబడింది. ఇక్కడ ఉన్న రెండు ప్రధాన ఆలయాలు శివునికి అంకితం చేయబడ్డాయి.

**కేదార్‌నాథ్ ఆలయం**
అమర్‌నాథ్ గుహకు వెళ్లే ముందు శివుడు పార్వతీదేవితో కలిసి ఇక్కడ నివసించాడు. ఈ ఆలయం పవిత్ర మందాకిని నది ఒడ్డున ఉంది. చలికాలంలో ఈ ఆలయ తలుపులు మూసి ఉంటాయి.

**శ్రీ అమర్‌నాథ్ గుహ దేవాలయం**
ఈ ఆలయం హిందూ మతంలో ముఖ్యమైన భాగాన్ని సూచిస్తుంది. ఎందుకంటే ఇక్కడే శివుడు తన భార్య పార్వతీదేవికి అమరత్వ రహస్యాన్ని వెల్లడించారు.



కేదార్‌నాథ్ ఆలయం



శ్రీ అమర్‌నాథ్ గుహ దేవాలయం

# శ్రీశైలం మహా క్షేత్రం

## దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం

(మహా నెట్ వర్క్)

శ్రీశైల క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇక్కడ మల్లికార్జున స్వామి (జ్యోతిర్లింగం) మరియు భ్రమరాంబికా దేవి (శక్తిపీఠం) దర్శనం పాపహరమని నమ్మకం. 11 రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో, రాత్రి వేళ జరిగే లింగోద్భవ అభిషేకం, స్వామివారి కల్యాణోత్సవం, నంది వాహన సేవ, మరియు సంప్రదాయ పాగా అలంకరణ ముఖ్యమైనవి. ఈ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. శ్రీశైలం, తెలుగు రాష్ట్రాల నుంచే కాక, దేశం నలుమూలల నుండి భక్తులు తరలివచ్చే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం. ఉత్సవాల నేపథ్యంలో శ్రీశైలం అద్భుతంగా సిద్ధమైంది.

### శ్రీశైల క్షేత్ర విశిష్టత:

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి: శ్రీశైలం పవిత్రమైన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి: భ్రమరాంబికా దేవి క్షేత్రం 18 శక్తిపీఠాలలో ఒకటి (సతీదేవి కంఠభాగం పడిన ప్రదేశం), ఇది అత్యంత శక్తివంతమైనదిగా పరిగణించబడుతుంది.

### భూకైలాసం:

మల్లన్న క్షేత్రం, శైవ, శాక్త క్షేత్రాల కలయికతో, నల్లమల అడవులలో పాతాళగంగ (కృష్ణా నది) ఒడ్డున ఉండటంతో భూకైలాసంగా పిలువబడుతుంది.

**మహా శివరాత్రి ఉత్సవాల ముఖ్య విశేషాలు:**

**బ్రహ్మోత్సవాలు:**

శివరాత్రి సందర్భంగా 11 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు, ధ్వజారోహణంతో మొదలై భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని పెంచుతాయి.

**పగళంకరణ :**

ఇది శ్రీశైలానికి ప్రత్యేకమైన సంప్రదాయం. కారుచీకటిలో, ఆలయ దీపాలు ఆర్పేసి, ఒక నేతకారుడు స్వామివారి విమాన గోపురం శిఖరం నుండి ముఖమండపంలోని నంది విగ్రహాల వరకు పాగా (తెల్లటి వస్త్రం) అలంకరిస్తారు.

**లింగోద్భవ కాల అభిషేకం:**

మహా శివరాత్రి అర్ధరాత్రి జరిగే లింగోద్భవ కాల అభిషేకం అత్యంత పవిత్రమైనది, ఈ సమయంలో స్వామిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం.

**స్వామి-అమ్మవార్ల కల్యాణం:**

ఉత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల వివాహం (కల్యాణోత్సవం) వైభవంగా జరుపుతారు, ఇది భక్తులకు కనువిందు చేస్తుంది.

**భక్తుల రద్దీ:**

శివరాత్రి సమయంలో సుమారు 1.50 లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారు, వీరి కోసం చలువ పందిళ్లు, తాగునీరు, మరియు సురక్షితమైన దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తారు.


### నడకదారి భక్తులు:

నల్లమల అడవి గుండా, పాతాళగంగలో స్నానం చేసి నడిచి వచ్చే భక్తులకు, ఈ పవిత్ర ప్రదేశం అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని ఇస్తుంది.





# దక్షిణకాశీలో అంగరంగ వైభవంగా..



**వేములవాడ:** ఆధ్యాత్మిక క్షేత్రం.. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి వేడుకలు భీమన్న క్షేత్రంలో వైభవంగా జరగనున్నాయి, రాజన్న ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో ఈసారి భీమేశ్వరాలయంలో వేడుకలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేములవాడకు చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో భక్తులకు స్వాగతం పలికేందుకు భారీ స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. భద్రత కోసం అడుగడుగునా సీసీ కెమెరాలు బిగించారు. భక్తులకు ఉచితంగా టిఫిన్స్, తాగునీరు, బటర్‌మిల్క్ పాకెట్లను సరఫరా చేయనున్నారు.

### చారిత్రక విశిష్టత

క్రీస్తుశకం 750 నుంచి 973 వరకు చాళుక్యరాజులు వేములవాడను రాజధానిగా చేసుకుని పరిపాలన చేశారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వీరికి పూర్వమే శాతవాహనులు పరిపాలించినట్లు ఆధారాలు ఉన్నట్లు చెబుతుంటారు. శాతవాహనుల కాలం నాటికే వేములవాడలో జైనులు, బౌద్ధుల ఆచార వ్యవహారాలు తెలిపే విగ్రహాలు అనేకం నేటికి ఉన్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేశారు. భీమేశ్వరస్వామి దర్శనాలు, కోడెమొక్కులు మాత్రమే అనుమతిస్తారు. భీమన్న ఆలయంతోపాటు బద్దిపోచమ్మ, నగరేశ్వరాలయం, కేదారీశ్వర, వేణుగోపాలస్వామి, నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి, అగ్రహారం జోడాంజనేయ స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు.

### శివరాత్రి పూజలు

మహాజాతర సందర్భంగా భీమన్న ఆలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. జాతర ఉత్సవాల సందర్భంగా నిరంతర దర్శనాలు అందుబాటులో ఉంటాయి. ఉచిత దర్శనంతోపాటు రూ.300 చెల్లించి వీఐపీ దర్శనం, రూ.50 చెల్లించి స్పెషల్ దర్శనాలు, రూ.100 చెల్లించి కోడెమొక్కులు, రూ.200 స్పెషల్ కోడె మొక్కులు, రూ.300 శీఘ్రదర్శనం టికెట్లపై దర్శనం చేసుకోవచ్చు.

### కోడె మొక్కు విశిష్టత

సంతానం లేని దంపతులు కొడుకు పుడితే కోడె కట్టేస్తామని రాజన్నకు మొక్కుంకుంటారు. సంతానం కలిగిన తర్వాత వేములవాడకు చేరుకుని స్వామి వారికి కోడెమొక్కు చెల్లించుకుంటారు. వ్యవసాయం బాగుండాలని మొక్కుకునే రైతుల సంఖ్య అధికంగానే ఉంటుంది. తమ పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నరైతులు నిజకోడెలను స్వామి వారికి అప్పగించి మొక్కులు తీర్చుకుంటారు.

# రాష్ట్ర అక్రిడేషన్ కమిటీలో టీజేఏను చేర్చడం హర్షణీయం

- ఉప్పల లక్ష్మణ్ కృషి,టీజేఏ అధ్యక్షులు రమణారావు పట్టుదల, పోరాట ఫలితమే
- టీజేఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా



**హుజూర్ నగర్ మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ)కు అక్రిడిటేషన్ రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించినందుకు శనివారం టీజేఏ సూర్యపేట జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆధ్వర్యంలో హుజూర్ నగర్ టీజేఏ సూర్యాపేట జిల్లా కార్యాలయం నందు కేక్ కట్ చేసి సంబరాలుజరుపుకున్నారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా మాట్లాడుతూ 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో టీజేఏ యూనియన్ అక్రిడేషన్ కమిటీలోకి రాకుండా చేశారని 12 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో టీజేఏ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ కృషి, టీజేఏ అధ్యక్షులు రమణారావు పట్టుదల,రాజేంద్రనాథ్, గోరి,తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ కమిటీ సహకారంతో విజయం సాధించడం హర్షనీయన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, కృషి చేస్తామని జర్నలిస్టులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారుఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా కమిటీ కోశాధికారి కొత్తపల్లి మధుసూదన్, జాయింట్ సెక్రెటరీ మక్బుల్ పాషా సభ్యులు కొల్లోజు నాగేంద్ర చారి, భీమపంగు వెంకటేశ్వర్లు, గోరంట్ల శ్రీనివాస్,బయ్యారపు రవీంద్ర,పెందుర్తి సతీష్,దాసరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 19వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి వల్లపు దాసు కృష్ణ గౌడ్ కు ఘన సన్మానం



**హుజూర్ నగర్ మహా:** హుజూర్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 19వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన వల్లపు దాసు కృష్ణ గౌడ్ ను 19వ వార్డు ముస్లిం సోదరులు ఆటో రఫీ,రియాజ్, ఆధ్వర్యంలో వాచ్ షాపు రఫీ,సైదా మేస్త్రి, షఫీ, టీడీపీ అలీ,బాబా,నాగులు మీరా,వార్డు ప్రజలు నాగప్రవీణ్ సిటీ కేబుల్ రవి,పవన్, వెంకయ్య, అంజి, నాగుల్, రఫీ,చిన షఫీ,పోక్లైన్ మజీద్ లతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించారు. హిందూ ముస్లింలు భాయ్ భాయ్ అంటూ ఐక్యమత్యంగా సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల ఒత్తిడిని తట్టుకొని ప్రజల మద్దతుతో నిలబడ్డ నాయకుడు వల్లపు దాసు కృష్ణ గౌడ్ అని ఆయనను ముస్లింలు కొనియాడారు.19వ వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని హుజూర్ నగర్ మున్సిపాలిటీలో 19వ వార్డు నెంబర్ వన్ గా నిలవాలని వారు కోరారు. ఈ సందర్భంగా వల్లపు దాస్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు అందరూ తమ కుటుంబ సభ్యుడిగా తనను భావించి తన గెలుపుకు కృషిచేసి తనను ఇండిపెండెంట్ గెలిపించిన తమరి రుణం తీర్చుకోలేనని జీవితాంతం తమకు రుణపడి ఉంటానని మీ నమ్మకాన్ని ఓమ్ము చేయనన్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలన వల్లే మున్సిపల్ ఎన్నికలలో విజయం

**యాదగిరిగుట్టలో బీర్ల అయిలయ్య మీడియా సమావేశం**



**యాదగిరిగుట్ట, మహా :** తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఎన్నికలో ముఖ్యమంత్రిపై నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం మరియు అభివృద్ధి రెండూ సమానంగా కొనసాగుతున్నాయని అందుకే పార్లమెంట్ ఎన్నికలు కావొచ్చు, అసెంబ్లీ ఎన్నికలు కావొచ్చు, ఎమ్మెల్సీ ఎన్నికలు కావొచ్చు, ఇటీవలి సర్పంచ్ ఎన్నికలు మరియు నిన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు భారీగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఓటర్ మహాశయులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారుఓటమి తప్పదని తెలిసినా యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపల్ లో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తుందని ప్రగల్భాలు పలికిన మహేందరన్నా.. ఇప్పుడు తల ఏడ పెట్టుకుంటవ్.?ప్రశ్నించారు 2020లో ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా ఎక్స్ అఫిషియో ఓట్లతో గుట్ట చైర్మన్ పీఠాన్ని లాక్కున్న రోజునే నీ పతనానికి బీజం పడింది కర్మ ఎవరినీ వదిలిపెట్టదు మహేందరన్న..అక్రమంగా లాక్కున్న చైర్మన్ పీఠం నుండి బీఆర్ఎస్ ను ఒక్క స్థానానికి పడేసిండ్రు ప్రజలు...అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఆలేరు ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉన్నరన్నారుప్రజల తీర్పునకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే పతనం తప్పదన్న నానుడికి నీ పతనమే మంచి ఉదాహరణ మహేందరన్న అని బీర్ల అయిలయ్య అన్నారుఇకనైనా అహంకారపూరిత మాటలు మానుకో.. లేకపోతే రాజకీయంగా భూస్థాపితం కాక తప్పదన్నారు.గత పదిహేనేళ్లలో రాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిశీలించి, ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజలు విశ్వాసం ఉంచారు. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.నిన్నటి మున్సిపల్ ఎన్నికల్లో 90% విజయాలు సాధించడం దీనికి నిదర్శనం,మా ముఖ్యమంత్రి నాయకత్వంలో, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరియు ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఘన విజయం దిశగా నడిపించారు.యాదాద్రి భువనగిరి ప్రజలు ఇచ్చిన మెజార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహా శివరాత్రి వేడుకలకు మణుగూరు నీలకంఠేశ్వరాలయం ముస్తాబు

**కాకతీయుల కాలపు చారిత్రక క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు..**



**మణుగూరు, మహా :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకతీయుల కాలం నాటి మణుగూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతోంది. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ చారిత్రక ఆలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, గ్రామ పెద్దలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, లైటింగ్ తదితర సదుపాయాలను సమకూరుస్తున్నారు. శ్రీ శివపార్వతుల కళ్యాణోత్సవం కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. జాగారం చేసే శివభక్తుల కోసం టెంట్లు, కార్పెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక సాంస్కృతిక వేదికను నిర్మిస్తున్నారు.కళా ప్రదర్శనల నిర్వహణలో భాగంగా పట్టణంలోని విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా భారీగా భక్తులు తరలివస్తారని భావిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శివనామస్మరణతో మణుగూరు క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది.

## గుట్టమల్లారంలో ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు..


**ఉమా రామలింగేశ్వరునికి అర్ధరాత్రి లింగోద్భవాభిషేకం**

**మణుగూరు, మహా :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు మండలం గుట్టమల్లారంలోని శ్రీశ్రీశ్రీ పంచముఖ వేద గాయత్రి మాత, శ్రీ వెంకటేశ్వర స్వామి సహిత శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా మహోత్సవాలు నిర్వహించనున్నారు. శైవక్షేత్రంగా పేరుగాంచిన ఈ ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఫిబ్రవరి 15వ తేదీ ఆదివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామివారికి మహాభిషేకాలు నిర్వహించనున్నారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగే ఈ అభిషేక సేవల్లో భక్తులు పాల్గొని శివానుగ్రహం పొందవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారు ప్రత్యేక అలంకారాలతో భక్తులకు దర్శనమిస్తారు. పుష్పాలంకరణ, దీపాలంకరణలతో ఆలయం శోభాయమానంగా అలరారనుంది. రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు స్వామివారి లీలా కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడుతుంది. శివపార్వతుల దివ్య కల్యాణ దృశ్యం భక్తుల్లో భక్తి భావాన్ని మరింత పెంచనుంది.అర్ధరాత్రి 12:30 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం సహస్ర బిల్వార్చన కార్యక్రమం జరుగుతుంది. శివనామస్మరణ, రుద్రపారాయణాలతో ఆలయ ప్రాంగణం మారుమోగనుంది.మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. శివతత్వాన్ని స్మరించుకుంటూ ఉపవాస దీక్షలతో, జాగరణతో భక్తులు ఈ పర్వదినాన్ని ఆచరించేందుకు సిద్ధమవుతున్నారు. గుట్టమల్లారం క్షేత్రం శివమయంగా మారి భక్తులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేయనుంది.ఓం నమః శివాయ నినాదాలతో ఆలయం మార్మోగనుంది.

# కాకతీయుల శైవక్షేత్రానికి ఆదరణ కరువు

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. ఆదాయాలుంటేనే చైర్మెన్ లా...?**

**అభివృద్ధికి ఆమడదూరంలో శంకరగిరి దుర్గేశ్వర ఆలయం**



**దమ్మపేట ,మహా :** హరహర మహదేవ..శంభోశంకర అంటూ భక్తులు శైవక్షేత్రాలకు తరలివెళ్ళే మహాశివరాత్రి పండుగ పర్వదినాన ఆనాటి చరిత్ర కలిగిన శైవక్షేత్రానికి ఆధరణ కరువైంది. చరిత్ర పుటల్లో లిఖించదగిన కాకతీయులు ,రెడ్డిరాజులు పరిపాలించిన ఆనాటి రోజుల్లోని శైవక్షేత్రాలకు నేడు అభివృద్ధి లేక ,ఆలనా పాలనా లేక వెలవెలబోతున్నాయి. కేవలం ఆదాయ వనరులున్న పట్టణ ప్రాంత ఆలయాలకు మాత్రమే గ్రామస్తులు లేదా ప్రజాప్రతినిధులు పోటీలు పడుతున్నారే తప్ప , గుట్టలపైన ,అడవుల్లో కొలువుదీరిన శైవక్షేత్రాలకు ఎటువంటి ఆసక్తి ని కనబరచకపోవడంతో అవి కాలక్రమేణ తమ ఉనికిని కోల్పోతున్నాయి. మహా శివరాత్రి ఒక్కరోజుకు మాత్రమే ముస్తాబు అయ్యే శివాలయాలు , కనీసం ఆరోజు కూడా ఆధరణ లేక ,పైసా ఆదాయం లేక వెలవెలబోతున్న పరిస్థితి చూస్తే ఎంతటి భక్తునికైనా మనస్సు చలించక తప్పదు. కానీ మండలంలో అత్యున్నత హోదాలో ఉన్న ప్రజాపాలకులు మాత్రం కనీసం ఈ ఆలయం వైపు ఒక్కసారైనా కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు కొందరి భక్తులనుండి తరచుగా వినిపిస్తున్నాయి.

**ఇంతకీ ఆ శైవక్షేత్రం ఎక్కడిదో... ఏ ప్రాంతంలో ఉందో తెలియజేయలేదు కదా...**

అదే నండి దమ్మపేట మండలానికి చెందిన గురవాయిగూడెం అటవీ ప్రాంతంలో ఎత్తైన గుట్టపై కొలువైన శంకరగిరి దుర్గేశ్వర స్వామి ఆలయం. ఈ ఆలయానికి గొప్ప చరిత్ర ఉన్నట్లు ఈ ప్రాంత ప్రజలు తరచుగా చర్చించుకుంటుంటారు. గతంలో కాకతీయుల పాలనలో ఈ శంకరగిరి గుట్టపై యుద్ధ సమయంలో సొరంగ మార్గాలు ఏర్పాటు చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలి వెళ్ళే గుర్తులు ,ఆ కాలపు కట్టడాలు ఇంకా నేటికి కూడా దర్శనమిస్తుంటాయి. అప్పుడు రాజులు నిత్యం శివారాధన చేసేవారు కాబట్టి శైవక్షేత్రాలకు అత్యంత ప్రాధాన్యత ఉండేది. అందుకే రాతి కట్టడాలతో శివాలయాన్ని నిర్మించి ,శివారాధన జరిపారని చరిత్ర చెప్పడం జరుగుతుంది. శత్రువుల నుండి తమ రాజ్యాన్ని కాపాడుకునేందుకు లోతైన దిగుడు బావులు , గుట్టపై చుట్టూ కోట గోడ వలే రాతితో నిర్మించిన బలమైన ,పొడవైన రాతి బండల కట్టడాలు నేటికీ దర్శనమిస్తుంటాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**ఆధరణ కరువు :**

ఇంతటి ఘనచరిత్ర గల శైవ క్షేత్రాన్ని ఇక్కడి ప్రజా పాలకులు నిర్వీర్యం గా ,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మాత్రం తరచుగా వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతానికి ఓ ఉన్నతస్థాయి అటవీశాఖ అధికారి కొంతమేరకు సహకరిస్తానని అప్పట్లో హామీ ఇచ్చినట్లు వార్తలు పుకార్లు చేశాయి. అటు తర్వాత కొందరు ప్రజా పాలకులు గుట్టపైకి ఏకంగా బిటి రోడ్ వేయిస్తామంటూ చేసిన హామీలు నీటిమూటలుగా మిగిలిపోయాయని భక్తులు ఆరోపిస్తున్నారు.

**చైర్మన్ పదవులు లేనందునే...:**

ఆలయానికి ముఖ్యంగా కమిటీ ,చైర్మన్ లేనందు వల్లనే ఎవరూ అభివృద్ధి చేయడం లేదనే అనుమానాలు పలువురిలో బలంగా ఉన్నాయి. ఆదాయ వనరులు లేని ఆలయాలకు కమిటీలు ,చైర్మన్లు అంటే ససేమిరా ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదనే వాదనలు మరికొందరు వినిపిస్తున్నారు. అందువల్ల ఈ ఆలయం అభివృద్ధి కి నోచుకోక ఆమడదూరంలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

**శంకరగిరి గుట్టపై శివనామస్మరణ :**

శంకరగిరి దుర్గేశ్వర గుట్టపై శివనామస్మరణ చేయాలని కొందరు గ్రామస్తులు ,మల్కారం ,గుర్వాయిగూడెం ,పెద్దగొల్లగూడెం ,చిన్నగొల్లగూడెం ,దమ్మపేట కు చెందిన శివభక్తులు పట్టుదలతో తమ శక్తి మేరకు చేస్తున్నారు. కానీ గుట్టపై ఉండటంతో కాలుదారి ,రాతి దారి తప్ప వేరే మార్గం లేనందున సాధారణ వ్యక్తుల వలన సాధ్యపడని పరిస్థితి లో ఉన్నారు. ఎవరైనా ప్రజా పాలకులే ,ప్రభుత్వ నిధుల ద్వారా అభివృద్ధి చేయిస్తే చరిత్ర ను గుర్తించినట్లు గా ఉంటుందని గ్రామస్తులంతా కోరుతున్నారు. కేవలం మహా శివరాత్రి కి మాత్రమే ఈ ఆలయం గుర్తు చేసుకునేలా కాకుండా ,నిత్యం గుర్తింపు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కొందరు కోరుతున్నారు.



## గౌరారం గ్రామంలో ఘనంగా ముత్యాలమ్మ జాతర

**మహా దుమ్ముగూడెం:** మండలంలోని గౌరారం గ్రామంలో ముత్యాలమ్మ పండగ ఘనంగా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న పండుగలు ఈ గ్రామ పెద్దలు ,పిల్లలు, మహిళలు భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా పాల్గొని తల్లికి నైవేద్యంగా సమర్పించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండటానికి ముత్యాలమ్మ తల్లి పండుగ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తరతరాలుగా చారిత్రక ఆధారంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.ఈ పండుగ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్యామల రవివర్మ, పెద్దలు కణితి రాముడు, శ్యామల సూర్య నారాయణ, కణితి ముత్తయ్య,గ్రామ పటేల్ సున్నం గంగరాజు, పూజారులు గుమ్మడి రమేష్,ఉయిక కన్నయ్య,పెద్దలు మడకం ఆదయ్య,మిడియం రుక్మిణి,తాటి వీరమ్మ,ఉయిక రమేష్, యూట్యూబర్స్ కణితి రాజు,తాటి ప్రవీణ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## తక్షణమే రహదారి నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలి



**చర్ల, మహా:** చర్ల బస్టాండ్ నుండి కాలేజీ వరకు రోడ్డును ఎప్పుడు వేస్తారు మహాప్రభో అని చర్ల బీ ఆర్ ఎస్ పార్టీ మండల తమ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. గతంలో రెండు సార్లు బీ ఆర్ ఏస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు చేయడం జరిగిందని, అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కాని పట్టించుకునే నాథుడే కరువయ్యారు అని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.



## కొత్తగూడెం రీజియన్ ఈపి ఆపరేటర్ల పదోన్నతులు ఏ గ్రేడ్ లో భర్తీ చేయాలి

**ఐ.ఎన్.టి.యు.సి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్**

**సత్తుపల్లి, మహా:** కొత్తగూడెం రీజినల్ స్థాయిలోని ఈపి ఆపరేటర్లల పదోన్నతులను ఏ గ్రేడ్ ఖాళీలలో భర్తీ చేయాలని ఐ.ఎన్.టి.యు.సి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈపి ఆపరేటర్ల పదోన్నతి స్థాయిని సి గ్రేడ్ నుండి బి గ్రేడ్ లో భర్తీ చేసినందుకు సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం రీజియన్ లోని మణుగూరు, ఇల్లందు, సత్తుపల్లి ఓ పెన్ కాస్ట్ గనులలో విధులు నిర్వహిస్తున్న బి గ్రేడ్ స్థాయి ఆపరేటర్లకు ఏ గ్రేడ్ స్థాయి పదోన్నతలు కల్పించాలని కోరారు. ఈ విషయంపై జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ స్పందిస్తూ ఆపరేటర్ల సమస్యలు ఉన్నత అధికారులతో చర్చించి తగిన పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు.

## ముస్తాబైన చింతల బయ్యారం శివాలయం..!

- శివాలయాల్లో కొనసాగనున్న ప్రత్యేక పూజలు
- భక్తులకు చలువ పందిళ్లు.. ప్రత్యేక క్యూ లైన్లు
- గోదావరి నది తీరాన స్నాన ఘట్టాలు



**పినపాక,మహా:** మండల వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకొని జరగబోయే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి చింతల బయ్యారం,సీతంపేట,దుగిగేపల్లి,గొట్టెల్ల శివాలయాలు ముస్తాబవుతున్నాయి.ముఖ్యంగా పాత రెడ్డిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలబయ్యారం గ్రామ సమీపంలోని గోదావరి నది తీరాన స్వయంభుగా వెలిసినటువంటి కాకతీయుల కాలంనాటి చారిత్రకమైన చరిత్ర కలిగిన పురాతనమైన శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం సర్వసుందరంగా ముస్తాబైంది. సాంప్రదాయ బద్ధంగా మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనునట్లు ఆలయ కమిటీ తెలిపారు. తెల్లవారుజామున 4గంటల నుండి భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు.6గంటల నుండిఅభిషేకాలు పూజలు నిర్వహించినట్లు తెలిపారు. స్వామి వారి కళ్యాణం రాత్రి 2 30 నిమిషాలు జరుగును.అనంతరం ఈశివపార్వతుల కళ్యాణ మహోత్సవ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీ ఉమా నీలకంటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటుంటారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్న నేపధ్యంలో ఆలయకమిటి వారు శివాలయ ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ భారీ ఎత్తున చేస్తున్నారు. దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు నిర్వహించే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారి ఊరేగింపునకు రథోత్సవానికి సుందరంగా పల్లకిని మెరుగులు దిద్దుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను పరిశుభ్ర పరుస్తూ, సర్వసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.అదే విధంగా గోదావరి నది తీరాన లోతు ప్రదేశం హెచ్చరిక బోర్డులుఏర్పాటు చేశారు. గోదావరి దగ్గర స్నానమాచరించే వారికి ముఖ్యంగా మహిళలు ఎలాంటి అసౌకర్యాలకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు.ఉపవాస దీక్షలతో భక్తులు శివపార్వతుల సన్నిధిలో జాగారణ చేస్తుంటారు.ఇదిలా ఉండగా ట్రాఫిక్ ను క్రమబద్దీకరణకు పోలీస్ లు, పంచాయతీ అధికారులతో సమన్వయంగా చర్యలు చేపట్టి వాహనాల పార్కింగ్ ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. శివపార్వతుల దర్శనానికి వచ్చే భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీ నియమ నిబంధనలు పాటిస్తూ పూజా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జాతరకు వచ్చే పిల్లలు,పెద్దలను అలరించడానికి భజన, కోలాట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాల్లో పెద్దఎత్తున మంచి నీరు సదుపాయం,మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు.అంతే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్యేక ఆరోగ్య కేంద్రాన్నిఏర్పాటు చేస్తున్నారు.చింతల బయ్యారం ఆలయ కమిటీ, అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

### మణుగూరు శ్రీ విద్య టెక్నో కృష్ణవేణి జూనియర్ కళాశాలలో

## ఘనంగా వీడ్కోలు వేడుకలు..





**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని శ్రీ విద్యా టెక్నో కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు శనివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం రంగురంగుల అలంకరణలతో కళకళలాడగా, విద్యార్థులు భావోద్వేగ వాతావరణంలో ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్లు పుచ్చకాయల శంకర్, బద్దం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చదువుతోపాటు మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, గురువుల పట్ల గౌరవం, పెద్దల పట్ల వినయం వంటి విలువలు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని పేర్కొన్నారు. లక్ష్యాన్ని నిర్ణయించుకుని పట్టుదలతో శ్రమిస్తే విజయం సులభమవుతుందని తెలిపారు.అలాగే సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని, సత్యనిష్ఠతో జీవించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను గౌరవిస్తూ వారి కష్టాన్ని గుర్తుంచుకుని ముందుకు సాగాలని కోరారు. పుస్తక జ్ఞానంతో పాటు ప్రవర్తనా జ్ఞానం కూడా సమానంగా అవసరమని వివరించారు. ప్రిన్సిపల్ పి నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ సారంగపాణి విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు, హాస్య నాటికలతో అందరినీ అలరించాయి. చివరగా జ్ఞాపికల ప్రదానం చేసి, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులకు విజయాశీస్సులు అందించారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## డాక్టరేట్ కే వన్నెతెచ్చిన 'గుమ్మడి '



**దమ్మపేట ,మహా :** ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య ను డాక్టరేట్ పట్టాతో సత్కరించటం పట్ల సిపిఎం మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమర్లపూడి రాము హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా ఐదుసార్లు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు గా ప్రజల మన్ననలు పొందిన నిరాడంబర వ్యక్తి గా గుమ్మడి నర్సయ్య ను గుర్తించడం గర్వించదగ్గ విషయమన్నారు. పదవీకాలం సమయంలో ఆనాడు అసెంబ్లీ కి వెళ్ళేందుకు కూడా సైకిల్ నే ఉపయోగించిన నిస్వార్థ ప్రజా సేవకుడికి డాక్టరేట్ రావడం ,డాక్టరేట్ కే వన్నెతెచ్చిన విదంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు లింగాలపల్లి సర్పంచ్ అప్పారావు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.



### అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్

## దారుణ హత్య...

**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సులేమాన్ నగర్‌లో అడ్వకేట్ గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఖదీర్‌ను గుర్తుతెలియని దుండగులు కత్తులతో దారుణంగా హత్య చేశారు. తన కార్యాలయంలో ఒంటరిగా ఉన్న సమయంలో దుండగులు వచ్చి కత్తి లతో దాడి చేశారు. మొహమ్మద్ ఖదీర్ అక్కడికక్కడే మృతి చెందాడు.నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు, క్లూస్ టీమ్ తో ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పలు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.




### రేపటి సమాజానికి దిక్సూచీలుగా

## గ్రూప్ వన్ విజేతలు..


**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్‌లోని కృష్ణ ప్రదీప్స్ 21 సెంచరీ ఐఏఎస్క్యాంపస్ నిర్వాహకులు కార్యాలయంలో శనివారం గ్రూప్1 విజేతల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కర్నూలు ఎంపీ నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. గ్రూప్1 (ఏపీపీఎస్సీ ,టిజిపిఎస్సి ) పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగాలు పొందిన విజేతలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూకఠిన శ్రమ, పట్టుదలతో గ్రూప్1 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలను సాధించిన అభ్యర్థులు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. పట్టుదలతో సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వ సర్వీసులో చేరబోతున్న విరంతా నిరుపేదలకు, సామాన్య ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులను భావి భారత అధికారులుగా తీర్చిదిద్దుతున్న కృష్ణ ప్రదీప్ ని వారి అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ కృష్ణ ప్రసాద్, అకాడమీ యాజమాన్యం అధ్యాపకులు, విజేతలు వారి తల్లిదండ్రులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### క్రికెట్ క్రీడా పోటీలను ప్రారంభించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ జోన్ పరిధి కొత్వాల్ గూడా డివిజన్ పరిధిలోని ఎయిర్పోర్ట్ కాలనీలో క్రికెట్ లీగ్ టోర్నమెంట్ను శనివారంబిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ ప్రారంభించారు. యువకులు గెలుపోవటములను సమానంగా తీసుకోవాలన్నారు. మనిషిలో పట్టుదలను పెంచేది క్రీడల్లో ఉంటుంది. ఇతర జట్లతో పోటీపడి విజయం సాధించాలన్నారు.



### దేవాలయ కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల

**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని గంగారం గ్రామంలో 15వ బెటాలియన్ కార్యాలయ ప్రాంగణంలో దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన), తన కుమారుడు దాసరి మధుమోహన్ రెడ్డి ఆర్థిక సహాయంతో నిర్మించిన దేవాలయ కళ్యాణ మండపాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన మంత్రి తుమ్మలకు 15వ పటాలపు పోలీస్ సిబ్బంది కవాతులతో గౌరవ వందనం తెలిపారు. కమాండెంట్ ఏ. అంజయ్య పుష్పగుచ్ఛం అందించి తుమ్మలకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గంగారం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని సొంత నిధులతో గ్రామనికి సేవలందిస్తున్న దాసరి కుటుంబాన్ని అభినందించారు. ఆలయ కళ్యాణ మండప నిర్మాణ దాతలు దాసరి వెంకటరామిరెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం 15వ పటాలపు కార్యాలయంలో కావలసిన వసతులను కమాండెంట్ అంజయ్య మంత్రి తుమ్మలకు విన్నవించారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అత్యవసర పరిస్థితులలో రెండు తెలుగు రాష్ట్రాలకు సేవలందించే 15వ బెటాలియన్ కార్యాలయంలో వసతులకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సంప్రదించి కావలసిన చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు.



## ఉద్యోగాల క్యాలెండర్ ను ప్రభుత్వం ప్రకటించాలి

**నేలకొండపల్లి, మహా:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఉద్యోగాల క్యాలెండర్ ను వెంటనే ప్రకటించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు సూచించారు. మండలం 'లోని కొత్తకొత్తూరు లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల క్యాలెండర్ ను ప్రకటించి చిత్తశుద్ధి ని నిరూపించుకోవాలని సూచించారు. అదే విధంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ రెండు వర్గాల అగ్రహానికి గురికావద్దని సూచించారు. 'పురపాలక ఎన్నికలలో కాంగ్రెస్ కు పట్టం కట్టారని పేర్కొన్నారు. తాము సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలుపుకు సహకరించినట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలు రేవంత్రెడ్డి పాలన కు రెఫరెండం అన్నారు. బీఆర్ఎస్ కు గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. టీజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరామ్ పై మాజీ ఎమ్మెల్సీ కవిత అవాకులు, చివాకులు పేలటం మానుకోవాలని సూచించారు. కోదండరామ్ ను విమర్శించే స్థాయి ఆమె కు లేదన్నారు. తీరు మారకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే జిల్లాలలో అన్ని కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. నేలకొండపల్లి లో జరిగిన పాలేరు డివిజన్ సదస్సు ను విజయవంతం చేసినందుకు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా నాయకులు బీ.రాజేందర్నాయక్, మాదాసు శ్రీనివాసరావు, గుగులోత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరంగా అక్రమ ఇసుక దందా

**దైనందిన కార్యక్రమంగా మారిన వైనం.. కేసులు, విడుదల, ఫైన్ లతో చులకనైన దందా**



**దమ్మపేట ,మహా :** ఇసుక అక్రమ దందా అనేది దైనందిన జీవితంలో ఒక భాగంగా మారింది. వారంలో రెండు లేదా మూడు సార్లు సరాసరిన కేసులు ,విడుదల ,ఫైన్ లు ఇలా కాలచక్రం లా మారాయి. ఆంధ్రా ప్రాంతం నుండి తెలంగాణ కు ఎటువంటి వే బిల్స్ లేకుండా , చెక్ పోస్ట్ లను దాటుకుంటూ ఇసుకను దర్జాగా దాటవేస్తున్నారంటే ,అక్రమార్కుల కు ఏస్థాయిలో నెట్వర్క్ పనిచేస్తుందనే విషయాన్ని అధికారులు ఆలోచించుకోవాల్సి ఉంది. ఐనప్పటికీ నిఘా నీడలో దమ్మపేట పోలీసులు మాత్రం ఇసుకాసురులపై డేగకన్నేసి అక్రమార్కుల ఆటకట్టిస్తునే ఉన్నారు. తాజాగా దమ్మపేట మండల ప్రాంతంలోని జలవాగు సమీపంలో ఆంధ్రా నుండి తరలివస్తున్న అక్రమ ఇసుక లారీలు మూడింటిని పట్టుకొని ,మైనింగ్ శాఖకు బదలాయించారు. ఈ సందర్భంగా యస్సై సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. అసలు ఎన్ని కేసులు పెట్టినా ,ఎంత సొమ్ములు జరిమానాలు వేసినా అడ్డుకోలేక పోతున్నారంటే..అక్రమార్కులు ఏ స్థాయి లో బరితెగిస్తున్నారో ఆలోచించాల్సి ఉంది. ఒక సారి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు మరలా మరలా అదే తప్పులు చేస్తున్నారంటే ..అదుపు చేసేవారెవరని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదే వ్యవహారం యదా రాజా తదాప్రజా అన్నచందంగా మారకముందే కఠిన చర్యలు తీసుకుంటే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చునంటూ పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఇసుక లారీల దుమ్ముతో.. గుట్ట మల్లారం గ్రామస్తుల ఇక్కట్లు

- మిషన్ భగీరథ పైప్ లైన్ పైప్ ధ్వంసం..
- గ్రామానికి తాగునీరు నిలిపివేత..
- రోడ్డెక్కి లారీల ఇసుక లారీల అడ్డగింత..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్ట మల్లారం గ్రామంలో ఇసుక లారీల నిరంతర రాకపోకలతో ప్రజల జీవనం దుర్భరంగా మారింది. గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతం గుండా నిత్యం వందలాది ఇసుక లారీలు తిరుగుతుండటంతో రోడ్లపై విపరీతంగా దుమ్ము లేచి గ్రామం మొత్తం కమ్మేస్తోంది. ఈ దుమ్ము ధూళి కారణంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.భారీ లారీల బరువుతో గ్రామంలోని మిషన్ భగీరథ తాగునీటి పైప్ లైన్ పగిలిపోవడంతో గ్రామానికి తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటికే దుమ్ము సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, ఇప్పుడు తాగునీరు లేక మరింత కష్టాల్లో ఉన్నారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి పథకమే ఇసుక రవాణా కారణంగా ప్రమాదంలో పడిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు. లారీల రాకపోకల వల్ల రహదారులు దెబ్బతింటున్నా, పైపులు పగిలిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు రోడ్డెక్కి ఇసుక లారీలను అడ్డుకుని నిరసన చేపట్టారు. మాకు దుమ్ము కాదు..నీళ్లు కావాలి అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ మార్గంలోఇసుక లారీల రాకపోకలను వెంటనే నిలిపివేయాలని, ధ్వంసమైన పైప్ లైన్ ను తక్షణమే మరమ్మతు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కారం కాని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

## మణుగూరులో యువకుడి మృతి.. కలకలం..

**నలుగురిపై హత్య కేసు నమోదు..**

**టిడిపి సెంటర్‌లో అర్ధరాత్రి బంధుమిత్రుల ధర్నా..**

**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం ప్రాంతంలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో యువకుడు మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. అడ్డగర్ల సురేష్ (32) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన శ్రీరామోజు సుధాకర్ చారి, అతని చెల్లెల్లు నవీన, జ్యోతి, మల్లేడి భాస్కర్ కలిసి హత్య చేశారని మృతుని తల్లి ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 6వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం గుట్ట మల్లారం లోని నవీన, జ్యోతి నివాసం వద్ద సురేష్‌తో వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే సుధాకర్ చారి, మల్లేడి భాస్కర్, జ్యోతి, నవీన కలిసి తనపై పెట్రోల్ పోసి హత్యాయత్నం చేశారని సురేష్ ఆరోపిస్తూ వీడియో రికార్డు చేసి వాట్సాప్ గ్రూపు ల ద్వారా పోస్టింగ్ పెట్టారు.తీవ్రంగా గాయపడిన సురేష్‌ను మొదట మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన మృతి చెందాడు. 8వ తేదీన సురేష్ పరిస్థితి విషమంగా మారడంతో స్థానిక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సమక్షంలో ఆయన మరణ వాంగ్మూలం నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం తన చావుకు కారణమని పేర్కొంటూ నలుగురు పేర్లు వెల్లడిస్తూ సురేష్ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయడం గమనార్హం.మృతుని తల్లి ధనలక్ష్మి మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. శుక్రవారం రాత్రి సురేష్ మృతదేహం మణుగూరుకు చేరుకోగానే పట్టణంలోని టిడిపి సెంటర్ వద్ద బంధుమిత్రులు ధర్నాకు దిగారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మణుగూరు సిఐ పార్థీ నాగబాబు, ఏడుల బయ్యారం సీఐ వెంకటేష్ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## కృష్ణయ్యకు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ...

**కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు ...**



**తల్లాడ, మహా:** తల్లాడ మండలం నరసింహారావుపేట గ్రామానికి చెందిన పగడాల కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆయన దశదిన కార్యక్రమం నరసింహారావు పేట వారి స్వగృహంలో జరిగింది.ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి,తన ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణయ్య మృతి తీరనిలోటని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు,ఆ పార్టీ మండల నాయకులు మారెళ్ళ దేవేందర్, తల్లాడ మండల సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పులి వెంకట నరసయ్య , నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు,నున్న చిన్న తిరుమలరావు తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫలితాల తర్వాత జగిత్యాల కాంగ్రెస్‌లో వీడని పీటముడి

**జగిత్యాల, మహా :** ఫలితాల తర్వాత జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో సరికొత్త రాజకీయ సమీకరణాలకు తెరలేపాయి. మొత్తం 50 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 23 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, స్పష్టమైన మెజార్టీ 26 స్థానాలు అవసరం కావడంతో విజయానికి స్వల్ప దూరంలో నిలిచిపోయింది. అయితే, పార్టీ సాధించిన ఈ 23 స్థానాల్లోనూ అంతర్గత చీలిక స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుండి 14 మంది, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గం నుండి 9 మంది కౌన్సిలర్లు విజయం సాధించడంతో పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది.

**రెండు వర్గాల నుంచి స్వతంత్రులు గెలుపు**

ఈ ఎన్నికల్లో 15 మంది స్వతంత్ర అభ్యర్థులు గెలవడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. విచిత్రమేమిటంటే, ఈ స్వతంత్రులలో కూడా గ్రూపు రాజకీయాలు స్పష్టంగా ఉన్నాయి. గెలిచిన 15 మంది స్వతంత్రులలో 9 మంది జీవన్ రెడ్డి వర్గానికిచెందిన వారు కాగా, 4 గురు ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి చెందిన వారు. మిగిలిన స్థానాల్లో బీఆర్ఎస్ 6, బీజేపీ 4, ఎంఐఎం 2 చోట్ల విజయం సాధించాయి. ఈ లెక్కల ప్రకారం చూస్తే, కాంగ్రెస్ అధికారిక అభ్యర్థులు, మద్దతుదారులైన స్వతంత్రులను కలిపితే పార్టీకి తిరుగులేని మెజార్టీ ఉంది, కానీ వర్గపోరు ఆ మెజార్టీని ప్రశ్నార్థకం చేస్తోంది.

**పీఠం కోసం మళ్లీ రెండు వర్గాల పోరు**

ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారింది. జీవన్ రెడ్డి వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొత్తం పద్దెనిమిది మంది ఉన్నారు. వీరిలో 9 మంది కాంగ్రెస్ పార్టీ తరపున 9 మంది స్వతంత్రులుగా గెలిచారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గం కూడా పద్దెనిమిది మంది ఉన్నారు. వీరిలో 14 మంది కాంగ్రెస్ , నలుగురు స్వతంత్రులు ఉన్నారు. తమ వర్గం వారికే చైర్మన్ పదవి దక్కాలని ఇద్దరు నేతలు పట్టుబట్టే అవకాశం ఉండటంతో జగిత్యాల రాజకీయం హీటెక్కింది. ఇప్పటికే పార్టీ జెండాను మోసిన వారికే చైర్మన్ పీఠం ఇవ్వాలని జీవన్ రెడ్డి గళమెత్తారు.

**అధిష్ఠానానికి ప్రతిష్ఠాత్మకం**

ఈ వర్గ పోరాటం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుందని కాంగ్రెస్ అధిష్టానం ఆందోళన చెందుతోంది. ఒకవేళ ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి రాకపోతే, చైర్మన్ ఎన్నిక సమయంలో అది రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది. సొంత పార్టీ నేతల మధ్య సమన్వయం కుదర్చడం ఇప్పుడు పీసీసీ పెద్దలకు ఒక సవాలుగా మారింది. స్వతంత్రుల మద్దతు ఎటువైపు ఉంటే వారికే చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉండటంతో, రాబోయే రోజుల్లో జగిత్యాల పురపాలక సంఘంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.



## ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

**నేలకొండపల్లి, మహా:** ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించాలని తిరుమలాపురం పంచాయతీ సర్పంచ్ కమదన ప్రవీణ్ సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులుసమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. పారిశుధ్యం పట్ల అప్రమతంగా ఉండాలని పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ను సహించేది లేదన్నారు. గ్రామాభివృద్ధిలో ఇటుపాలకులు, అటు ప్రజలు, అధికారులు ఐక్యంతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి లో ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరబాబు, ఏఎన్యం వై.రాణి, అంగన్వాడీ టీచర్ ధనలక్ష్మి, ఆశా వర్కర్ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు మండలాల క్రికెట్ టోర్నమెంటులో తల్లాడకు ప్రథమ బహుమతి

**తల్లాడ, మహా:** ఏన్కూర్ లో 4 మండలాల స్థాయి లెజెండ్ క్రికెట్ టోర్నమెంట్ లో తల్లాడ జట్టు ప్రథమ స్థానంలో విజయం సాధించింది. ఈ సందర్భంగా తల్లాడ జట్టు ప్రథమ బహుమతితో పాటు మరికొన్ని అవార్డులను గెలుసుకున్నారు. ద్వితీయ స్థానాన్ని ఏన్కూరు జట్టు గెలుచుకున్నారు. ఈ టోర్నమెంట్ లో తల్లాడ టీమ్ ప్లేయర్స్ విన్నర్స్ ట్రోఫీ తో పాటుగా అనేక ఇతర ట్రోఫీ లు గెలుచుకున్నారు. బెస్ట్ కెప్టెన్ గా సురేష్ కుమార్, ఫైనల్ మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా ధనమూర్తి, బెస్ట్ వికెట్ కీపర్ గా సూరి ఉపేంద్ర లు అవార్డ్స్ గెలుచుకున్నారు. ఈ టోర్నమెంట్ కి ముఖ్య అతిధులుగా కోదాడ ప్రభుత్వ వైద్యాధికారి దశరథ నాయక్, ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూగులోతు లచ్చిరం నాయక్ హాజరై విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లాడ జట్టు రాణించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి మన కీర్తిని ఇమడింపజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

**జూలూరుపాడు, మహా:** పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక మండల కేంద్రంలోని పాస్టర్ మహేష్ విక్టరీ హోలీ ఫెయిత్ మందిరము లో శనివారం జరిగింది. గత కమిటి పదవి కాలం ముగియడంతో నూతన కమిటీని ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ అధ్యక్షులు గా పాస్టర్ వి. నతానియేల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ గా పాస్టర్ జి. ఇస్సాకు, సెక్రటరీ గా పాస్టర్ డి శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీగా పాస్టర్ జి మహేష్, ట్రెజరర్ గా పాస్టర్ యం కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు గా పాస్టర్ మనోజ్ కుమార్, పాస్టర్ వై సమూయేల్ రాజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులు పాస్టర్ వి నతానియేల్ రాజ్ మాట్లాడుతూ మండల సేవకులకు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పథకాలు, ఫలాలు అందేలా సహకారం అందిస్తామని, క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలు తన కమిటీ పరిష్కరిస్తుందని హామీ ఇవ్వడం జరిగింది.

## ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి

**తల్లాడ, మహా:** విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులసమావేశంలో రైతు సంఘం నాయకులు సత్యనారాయణ రెడ్డి. ఈరోజు తల్లాడ దొడ్డ కృష్ణయ్య భవనంలో విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల డివిజన్ స్థాయి సమావేశం రాజారావు అధ్యక్షతన జరిగినది. దీనిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ జిల్లా అధ్యక్షులు ఉపేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు అందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకొని తమకు రావలసిన వేతనాలు పొందాలని ఈ సందర్భంగా తెలియపరిచిన విద్యుత్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులైన మీటర్ రీడర్ , లు బిల్ కలెక్టర్లు అన్ మేన్ కార్మికులు , కనీస వేతనాలు లేవని ఏళ్ల తరబడి పనిచేస్తున్న గాని యాజమాన్యం ప్రభుత్వం గుర్తించడం లేదని అధికారాంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే వీరి గురించి చర్య తీసుకోవాలని రాబోయే రోజులలో దీనికోసం పెద్ద ఎత్తైన ఆందోళన చేయాల్సి ఉంటుందని తెలియపరిచినారు. అనంతరం వారు డివిజన్ కమిటీని ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షులుగా అశోక్, డివిజన్ అధ్యక్షులుగా రాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామకృష్ణ ,కార్యదర్శులు . డి.సురేష్ ఉపాధ్యక్షులుగా ఎస్. వంశీ, ఎస్ .రాము సహాయ కార్యదర్శులుగా హరి,నరేష్ , కోశాధికారిగా రాజేష్ ఎన్నుకున్నారు.




## న్యూ ఢిల్లీ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ లో ఖమ్మం యువకుడి షార్ట్ ఫిలిం LUNAకు అవార్డు

ఖమ్మం నగరానికి చెందిన యువ దర్శకుడు గోగినేని ఆకాష్ రూపొందించిన సైన్స్ ఫిక్షన్ షార్ట్ ఫిల్మ్ "LUNA"కి న్యూఢిల్లీలో భారత మండపంలో వేదికగా నిర్వహించి న్యూఢిల్లీ ఫిలిం ఫెస్టివల్ లో అవార్డు లభించింది. ఇంతకుముందే ఈ చిత్రం Jaipur International Film Festivalకు అధికారికంగా ఎంపికైన విషయం తెలిసిందే. ఇప్పుడు ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన చిత్రాల్లో ఒకటిగా "LUNA" అవార్డు అందుకోవడం దర్శకుడి ప్రయాణంలో మరో ముఖ్యమైన అడుగుగా నిలిచింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆకాష్ తరపున ఆయన తల్లిదండ్రులు ఢిల్లీకి వెళ్లి ఫిబ్రవరి 13న జరిగిన రెడ్ కార్పెట్ కార్యక్రమంలో పాల్గొని, 14వ తేదీన అవార్డును స్వీకరించారు. ఈ విజయంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





# కోకాపేటలో కొత్త రియల్ఎస్టేట్ ట్రెండ్

**విలాసవంతమైన గృహ విభాగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. గృహ కొనుగోలుదారులు అభిరుచులకు అనుగుణంగా సంస్థలు ఇళ్లను నిర్మిస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రైవసీ, భద్రత, గ్రీనరీకి అధిక ప్రాధాన్యం ఇచ్చిన బిల్డర్లు.. ఇప్పుడు కస్టమర్లకు అంతర్జాతీయ స్థాయి సేవలను అందించేందుకు సిద్ధమయ్యారు. లగ్జరీ ఆతిథ్య సంస్థల భాగస్వామ్యంతో గృహ నిర్మాణాలను చేపడుతున్నారు. హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్ఎన్ఐ), ప్రవాసుల నుంచి ఈ తరహా ఇళ్లకు విపరీతంగా డిమాండ్ ఉంది. ప్రధానంగా కోకాపేట, పుప్పాలగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాయదుర్గం వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లో ఇటువంటి ఫైవ్ స్టార్ హోమ్స్ వస్తున్నాయి.**



రియల్ ఎస్టేట్ రంగంలో మార్కెటింగ్ కోసం ఇప్పుడు ఏ ప్రాజెక్ట్ మీద చూసినా లగ్జరీ అనేది కనపడుతోంది. విలాసవంతంగా ఉన్నా లేకున్నా ఈ పదం వాడేస్తున్నారు. అందరూ లగ్జరీ అనే ట్యాగ్ వాడటంతో అర్థమే మారిపోయింది. కొందరు మాత్రమే ఈ స్థాయి ప్రమాణాలతో కడుతున్నారు. కొనుగోలుదారులు సైతం ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తిరుగుతుండటంతో విలాసం అంటే ఎలా ఉంటుందో వారికి అవగాహన పెరిగింది. దీంతో నిర్మాణ సంస్థలు లగ్జరీకి పునఃనిర్వచనం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. ఇదు నక్షత్రాల రేటింగ్ కలిగిన నివాసాలను నిర్మించేందుకు నిర్మాణ సంస్థలు ప్రసిద్ధ ఆతిథ్య సంస్థలతో జతకడుతున్నాయి. డిజైనింగ్ ప్రమాణాలను పెంచడంతో పాటు నివాసం ఉండేవారికి స్టార్ హోటల్ మాదిరి సేవలు కల్పించేందుకు భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయి.

**హోటల్స్, ఫ్యాషన్ డిజైనర్లతో ఒప్పందం**

ఇంటర్ కాంటినెంటల్, మారియట్, తాజ్, రిడ్జ్, కార్ల్‌టన్, లీలా వంటి స్టార్ హోటల్ బ్రాండ్స్, అబుజానీ, సందీప్ ఖోస్లా వంటి ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లతో నగరానికి చెందిన పలు ప్రముఖ నిర్మాణ సంస్థలు భాగస్వామ్యం చేసుకొని గృహ నిర్మాణాలను చేపడుతున్నాయి. డిజైనింగ్, ఆర్కిటెక్చర్, ఎలివేషన్స్, విస్తీర్ణం, వసతులు, సేవలు.. అన్నీ టాప్ క్లాస్‌గా ఉంటాయి. నివాసితులకు అంతర్జాతీయ జీవనశైలి అనుభూతిని అందించడమే ఈ గృహాల ప్రత్యేకత.

**హెచ్ఎన్ఐ, ప్రవాసులు కస్టమర్లు..**

కరోనా నుంచి నగరంలో హైఎండ్ గృహాలకు ఆదరణ పెరిగింది. ఆధునికత, విలాసవంతమైన జీవనశైలికి నేటి యువ గృహ కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు. హెచ్ఎన్ఐలు, ప్రవాసులు, బిజినెస్ టైకూన్లు, సినీ, క్రీడా సెలబ్రిటీలు డిజైనర్ హోమ్స్‌కు ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణంగా ఈ తరహా ఇళ్ల కొనుగోలుదారులు సెకండ్ లేదా థర్డ్ హోమ్ బయ్యర్లు ఉంటారు.

ఇందులో నివాసం ఉండటం స్టేటస్ సింబల్‌గా భావిస్తుంటారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, రాయదుర్గం, నియోపొలిస్, నానక్‌రాంగూడ, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పుప్పాలగూడ, తెల్లాపూర్, మదీనాగూడ, నల్లగండ్ల వంటి ప్రాంతాల్లో ఈ తరహా ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు. వీటి విస్తీర్ణం 6 వేల చదరపు అడుగుల నుంచి ప్రారంభవుతుంది. ధర రూ.6 కోట్ల నుంచి ఉంటుంది.

**వీటి ప్రత్యేకతలివే..**

స్టార్ హోమ్స్ అంటే హోటల్ ఆధారిత ప్రాజెక్ట్‌లు. ఇందులో లేఔట్ స్థలంలో నివాసాల కోసం ప్రత్యేకంగా ఒక టవర్ ఉంటుంది. పక్కనే మరో టవర్‌లో హోటల్ ఉంటుంది. నివాసితులకు సేవలన్నీ ఆతిథ్య సంస్థలే నిర్వహిస్తాయి. కొన్ని ప్రాజెక్ట్‌లలో దిగువ అంతస్తుల్లో హోటల్, ఎగువ అంతస్తులో నివాస యూనిట్లు ఉంటాయి. నివాసితులకు ప్రత్యేకంగా యాప్ ఉంటుంది. ఇందులో నుంచి ఫుడ్, స్పా, సెలూన్ వంటివి ఆర్డర్ చేయవచ్చు. వాళ్లే అపార్ట్‌మెంట్‌కు వచ్చి సర్వీస్ చేస్తారు. అలాగే వీటిల్లో సెవెన్ స్టార్ హోటల్‌లో మాదిరి గ్రాండ్ లాంజ్, డబుల్ హైట్ బాల్కనీ, హోమ్ ఆటోమేషన్, బ్యూటీఫుల్ వ్యూ, స్కై లాంజ్, స్పా, మినీ థియేటర్, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్ వంటి అన్ని రకాల ఆధునిక వసతులుంటాయి.

**ప్రైవసీ, భద్రత..**


ప్రైవసీ, భద్రత ఈ ప్రాజెక్ట్‌ల ప్రత్యేకత. వెంటిలేషన్, ఓపెన్ స్పేస్, వేర్వేరుగా ఎంట్రీ అండ్ ఎగ్జిట్ ద్వారాలు, ప్రతి అపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక మార్గం ఉంటుంది. అపార్ట్‌మెంట్ ఫేసింగ్ ఎదురెదురుగా ఉండదు. దీంతో పూర్తిగా ప్రైవసీ ఉంటుంది. విశాలమైన బాల్కనీ, గ్రీనరీ, ఓపెన్ స్పేస్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సాధారణ గృహాలతో పోలిస్తే ఈ డిజైనర్ హోమ్స్‌లో 5-7 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇంట్లోకి గాలి, వెలుతురు ధారాళంగా వస్తాయి.

# ఏఐ ప్రమాదం.. సెబీ చైర్మన్ హెచ్చరిక!



ఏఐ వల్ల ఉద్యోగాలు ఊడిపోతున్నాయని పలువురు టెక్ నిపుణులు చెబుతున్నవేళ.. సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని హెచ్చరించారు. ఏఐ వంటి లేటెస్ట్ టెక్నాలజీ.. ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి.. దీనికి అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలు సైతం అభివృద్ధి చెందాలని పాండే పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ ముస్తఫా సులేమాన్‌ను ఉటంకిస్తూ.. రాబోయే ఏఐ, సింథటిక్ బయాలజీ వంటివన్నీ మానవాళికి సవాలుగా మారుతాయని వెల్లడించారు. ఈ సాంకేతికతలు మన జీవితాలను మెరుగుపరచగలిగినప్పటికీ.. సరైన నియంత్రణ లేకపోతే సమస్యలను కూడా సృష్టించగలవని అన్నారు. ఏఐ టెక్నాలజీని దృష్టిలో ఉంచుకునే.. సెబీ సూపర్‌టెక్ (సూపర్‌వైజరీ టెక్నాలజీస్) & రెగ్‌టెక్ (రెగ్యులేటరీ టెక్నాలజీస్) వంటి సాంకేతిక పద్ధతులను అమలు చేస్తోంది. అంతే కాకుండా.. సైబర్ భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, డేటా పరిపాలనను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకుంటోంది. సెక్యూరిటీస్ మార్కెట్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ & దీర్ఘకాలిక సాంకేతిక వ్యూహ పథకాన్ని రూపొందించడానికి ఒక ఉన్నత స్థాయి నిపుణుల బృందాన్ని కూడా ఏర్పాటు చేసిందని పాండే పేర్కొన్నారు.

# పైలట్‌లకు భలే డిమాండ్.. రూ.లక్షల్లో జీతాలు



భారతీయ విమానయాన రంగంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దేశంలో అతిపెద్ద ఎయిర్‌లైన్ అయిన ఇండిగో (IndiGo) తన చరిత్రలోనే అతిపెద్ద కాక్పిట్ నియామక డ్రైవ్‌లలో ఒకదాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. పల విభాగాల్లో 1,000 మందికి పైగా పైలట్లను నియమించుకునేందుకు సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. ట్రెయినీ ఫస్ట్ ఆఫీసర్లు, సీనియర్ ఫస్ట్ ఆఫీసర్లు, కెప్టెన్లు వంటి అన్ని స్థాయిలలో నియామకాలు జరగనున్నాయి. ఈ నిర్ణయం 2025 డిసెంబర్‌లో ఎదురైన తీవ్రమైన సిబ్బంది కొరత, ఆ కారణంగా ఏడు రోజుల్లో వేల సంఖ్యలో విమానాలు రద్దైన ఘటనల తర్వాత తీసుకున్నదిగా తెలుస్తోంది. కొత్తగా అమల్లోకి వచ్చిన విశ్రాంతి నిబంధనలతో (FDTL) సిబ్బంది లభ్యతపై ఒత్తిడి పెరగడంతో, భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యగా ఈ భారీ నియామక ప్రక్రియ ప్రారంభమైంది.

**డీజీసీఏ కొత్త నిబంధనలు**

విమాన సురక్షత దృష్ట్యా డీజీసీఏ (DGCA) పైలట్లకు సంబంధించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ (FDTL) నిబంధనలను సవరించింది. కొత్త నియమాల ప్రకారం పైలట్లకు తగిన విశ్రాంతి సమయం తప్పనిసరి. దీంతో రోస్టర్ నిర్వహణలో మార్పులు అవసరమయ్యాయి. కొంతకాలం తాత్కాలిక సడలింపులతో సేవలు నిర్వహించిన ఎయిర్‌లైన్లు, ఇప్పుడు పూర్తిస్థాయి అమలుకు సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు పైలట్ల అవసరం ఏర్పడింది.

**నియామకాల్లో ప్రత్యేకత**

ఇండిగో విమానాల్లో ప్రధానంగా ఎయిర్‌బస్ A320 కుటుంబానికి చెందిన విమానాలు ఉపయోగిస్తుండగా, ముందస్తు A320 అనుభవం లేకపోయినా అర్హత కలిగిన పైలట్లను తీసుకోవడానికి సంస్థ సిద్ధంగా ఉందని సమాచారం.విమానాల సంఖ్య పెరుగుతుండడం, అంతర్జాతీయ మార్గాల్లో విస్తరణ జరగడం, ప్రయాణికుల రద్దీ పెరగడం వంటి అంశాలు కూడా నియామకాల వేగాన్ని పెంచుతున్నాయి.

**పైలట్ల జీతాలు ఎలా ఉన్నాయంటే..**

భారతీయ విమానయాన రంగంలో పైలట్ వృత్తి అత్యంత అధిక వేతనాలు కలిగిన కెరీర్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సాధారణంగా జీతాలు (అంచనా) ఇలా ఉంటాయి..

**ట్రెయినీ ఫస్ట్ ఆఫీసర్:** నెలకు రూ.80,000 నుంచి రూ.1.5 లక్షలు

**ఫస్ట్ ఆఫీసర్ (FO):** రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షలు

**సీనియర్ ఫస్ట్ ఆఫీసర్ (SFO):** రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షలు

**కెప్టెన్:** రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ

నడిపే విమాన రకం, అనుభవం, ఫ్లైట్ గంటలు, అంతర్జాతీయ మార్గాలు వంటి అంశాలపై ఆధారపడి ఈ మొత్తాలు మారవచ్చు.

**ఇతర భత్యాలు, సౌకర్యాలు**

జీతంతో పాటు పైలట్లకు పలు అదనపు ప్రయోజనాలు ఉంటాయి. అవి.. లేఓవర్ అలవెన్సులు (దేశీయ, అంతర్జాతీయ). ఫ్లైట్ గంటల ఆధారిత ప్రోత్సాహకాలు. మెడికల్ ఇన్సూరెన్స్ & లైఫ్ కవర్. కుటుంబ సభ్యులకు ఉచిత/తగ్గింపు ధరల ప్రయాణ సౌకర్యం. శిక్షణా అవకాశాలు, టైప్ రేటింగ్ మద్దతు. పనితీరు ఆధారిత బోనసులు. కొన్ని ఎయిర్‌లైన్లు పైలట్ల మనోబలాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీలను కూడా ప్రవేశపెడుతున్నాయి.

**ఇతర ఎయిర్‌లైన్లలోనూ నియామకాలు**

భారతదేశంలో పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఆకాశ ఎయిర్ (Akasa Air) వంటి కొత్త ఎయిర్‌లైన్లు కూడా పైలట్ల నియామకాలను వేగవంతం చేస్తున్నాయి. వేతనాలు, సౌకర్యాల పరంగా పోటీ వాతావరణం నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్లో కూడా అనేక ఎయిర్‌లైన్లు భారత పైలట్లకు అవకాశాలు అందిస్తున్నాయి. దీనితో దేశీయంగా జీతాల నిర్మాణంలో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# అమెరికా వ్యూహం.. ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడి?



**వాషింగ్టన్:** అణ్వాయుధ కార్యక్రమాలు నిలిపివేసేలా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచాలని అమెరికా నిర్ణయించింది. ఇందుకోసం భారీగా సైన్యాన్ని తరలిస్తోంది. ఒకవైపు ఇరాన్‌తో చర్చలు జరుగుతుండగానే, మరోవైపు బలప్రయోగంతో ఇరాన్‌ను దారికి తెచ్చుకోవడానికి పావులు కదుపుతోంది. భారీ విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్' తోపాటు మరికొన్ని యుద్ధ నౌకలను మధ్య ప్రాచ్యానికి తరలిస్తోంది. ఇప్పటికే 'యూఎస్ఎస్ అబ్రహాం లింకన్' నౌకను అరేబియా సముద్రంలో మోహరించింది. 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్' ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధ విమానాల వాహక నౌకగా పేరుగాంచింది. వెనెజులాలో గత నెలలో జరిగిన అమెరికా సైనిక ఆపరేషన్‌లో పాలుపంచుకుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం నిర్బంధించిన సంగతి తెలిసిందే.

**ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడి?**

ఇరాన్ అణు కార్యక్రమాలపై అమెరికా ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. వాటిని తక్షణమే నిలిపివేయాలని, ఈ విషయంలో తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని పట్టుబడుతోంది. తమ వద్ద అణ్వాయుధాలు లేవని ఇరాన్ చెబుతున్నప్పటికీ అమెరికా విశ్వసించడం లేదు. ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏ క్షణమైనా దాడికి దిగే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్నాయి. దీనిపై అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం మొదలైతే మధ్యప్రాచ్యంలో భారీ సంక్షోభం తప్పదని చెబుతున్నాయి.

# స్పందించిన పాక్.. ఇమ్రాన్ ఖాన్ తరలింపు?



ఇటీవల పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. వైద్యవసతి సరిగ్గా లేక ఆయన 85శాతం చూపు కోల్పోయారని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇమ్రాన్ ఖాన్‌ని సరైన వైద్యవసతులు కల మరో కొత్త జైలుకు తరలించనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఆడియాలో జైల్లో ఉన్న పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకర వార్తలు ప్రచురితమయ్యాయి. ఇప్పటికే ఎన్నో అనారోగ్య సమస్యలతో సతమవుతువుతున్న ఇమ్రాన్‌ఖాన్ ప్రస్తుతం కంటి చూపు సన్నగిల్లుతున్నట్లు ఆయన తరపు న్యాయవాది తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ తన కుడి కంటిలో 85% చూపు కోల్పోయి, ప్రస్తుతం కేవలం 15% మాత్రమే మిగిలి ఉందని వైద్య నివేదికలు తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో ఇమ్రాన్ పట్ల ఉద్దేశపూర్వకంగా అత్యంత అమానుషంగా అడియాలా జైలు అధికారులు వ్యవహరిస్తున్నారని పాక్‌లో ఆరోపణలు వెల్లడయ్యాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇమ్రాన్ ఖాన్‌ను త్వరలోనే ఇస్లామాబాద్‌లోని జైలుకు తరలిస్తామని ఆ దేశ మంత్రి మోసిన్ నఖ్వీ పేర్కొన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు, కంటిచూపు కోల్పోవడం దృష్ట్యా ప్రత్యేక వసతులతో ఆయన సెల్ నిర్మిస్తామని తెలిపారు. అయితే గతేడాది అక్టోబర్ వరకు ఆయనకు సాధారణ చూపు ఉన్నప్పటికీ, తరువాత రక్తం గడ్డ కట్టడం వల్ల తీవ్రమైన నష్టం జరిగినట్లు వైద్యులు తెలిపారు.ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి పాకిస్తాన్‌లో రాజకీయంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఆయన చూపు కోల్పోవడం వైద్యపరమైన సమస్య మాత్రమే కాకుండా, జైలు పరిస్థితులు మరియు ప్రభుత్వ వైఖరిపై కూడా ప్రశ్నలు లేవనెత్తింది దీంతో ప్రభుత్వం స్పందించినట్లు తెలుస్తోంది.

# ఖలిస్థానీ ఉగ్రవాది హత్య కుట్ర..

## నేరం ఒప్పుకున్న భారత సంతతి..?



ఖలీస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూ హత్య కుట్ర కేసులో భారత సంతతికి చెందిన నికిల్ గుప్తా తన నేరాన్ని అంగీకరించినట్లు అమెరికా న్యాయ విభాగం పేర్కొంది. కాగా ఇదివరకే ఈ కేసులో ఆయనను అమెరికా అధికారులు అరెస్టు చేయగా తాజాగా ఆయన నేరం ఒప్పుకున్నట్లు తెలిపింది. భారత రా విభాగానికి చెందిన ఓ రా అధికారి డైరెక్షన్‌లోని ఆయన ఈ హత్య ప్రణాళిక చేసినట్లు USA ఆరోపిస్తుంది. అమెరికా న్యాయవిభాగం ప్రకారం ... 2023లో భారత్‌కు చెందిన వికాస్ యాదవ్ అనే అధికారి ఆదేశాల మేరకే నికిల్ గుప్తా, గుర్‌ప్రీత్ సింగ్ హత్యకు కుట్ర పన్నినట్లు అధికారులు తెలిపారు. ఆయన కుట్రకు గానూ లక్ష డాలర్లు సుఫారీగా నిర్ణయించారని అందుకు అడ్వాన్స్‌గా 15 వేల డాలర్లు చెల్లించారని అమెరికా అధికారులు పేర్కొన్నారు. భారత వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నందుకే గుప్తాను అంతమెుందించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. కాగా ఖలిస్తాన్ అనే ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయడం కోసం పిలుపునిస్తూ, హింస, వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తున్నాడని భారత్ ఆరోపిస్తున్నట్లు అమెరికా గతంలో పేర్కొంది. నికిల్ గుప్తా మాన్‌హాటన్‌లోని ఫెడరల్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఎదుట తన దోషాన్ని అంగీకరించినట్లు అమెరికా న్యాయ విభాగం ప్రకటించింది. ఈ కేసులో ఆయనకు శిక్ష 2026 మే 29న విధించబడనుంది. గరిష్టంగా 40 సంవత్సరాల జైలు శిక్ష పడే అవకాశం ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తుది శిక్షను కోర్టు నిర్ణయించనున్నట్లు అధికారులు తెలిపారు. భారత ప్రభుత్వం ఇదివరకే ఖలిస్థానీ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నూను ఉగ్రవాద నిరోధక చట్టమైన అన్యాయ కార్యకలాపాల (నిరోధక) చట్టం (UAPA) కింద ఉగ్రవాదిగా ప్రకటించింది. ఆయన సంస్థను సైతం భారత్‌లో బ్యాన్ చేసింది. అయితే పన్నూ హత్యకు కుట్ర కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని భారత్ తమకు వెల్లడించినట్లు గతంలోనే అమెరికా తెలిపింది. కాగా ఇప్పుడు భారత్ ఏవిధంగా స్పందిస్తోందో వేచి చూడాలి.

# భార్య ఎఫైర్.. చివరికి ఎంత దారుణం జరిగిందంటే..



బ్రెజిల్‌లో ఇటుంబియారాలో దారుణం జరిగింది. భార్య అక్రమ సంబంధం.. ఓ కుటుంబాన్ని బలి తీసుకుంది. భార్య మరో వ్యక్తితో ఎఫైర్ పెట్టుకోవడంతో భర్త తన ఇద్దరు పిల్లలను హత్య చేసి అనంతరం తాను ఆత్మహత్యకు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇటుంబియారా ప్రభుత్వ మున్సిపల్ సెక్రటరీ తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. అయితే, భార్య మరో వ్యక్తితో సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఆమెపై నిఘా పెట్టాడు. ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు ఓ ప్రైవేట్ డిటెక్టివ్‌ను సైతం నియమించి పకడ్బందీగా ప్లాన్ చేశాడు.. భార్య తన ప్రియుడిని కలిసినప్పుడు వీడియో ఆధారాలు కూడా సంపాదించాడు. అక్రమసంబంధం నిజమేనని నిర్ధారణ కావడంతో తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. తన ఇద్దరు పిల్లలను హత్య చేసి అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణానికి కొన్ని గంటల ముందు ఆ వ్యక్తి.. తన సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. ఆ వీడియోలో తన పిల్లలపై ఉన్న ప్రేమను వ్యక్తపరుస్తూ, "దేవుడు నా పిల్లలను ఎల్లప్పుడూ ఆశీర్వదించుగాక, నాన్న మిమ్మల్ని చాలా ప్రేమిస్తున్నాడు" అనే క్యాప్షన్‌ను రాశారు. చూడముచ్చటగా ఉన్న వీరి ఫ్యామిలీ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భార్యా భర్తల జంట ఎంతో అందంగా ఉండటం.. పిల్లలు సైతం క్యూట్‌గా ఉండటంతో వీరి ఫ్యామిలీ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఆ మహిళ చేసిన పనికి నెటిజన్లు మండిపడుతున్నారు. తండ్రి,.. క్షణికావేశంలో పిల్లల ప్రాణాలు తీయడం పట్ల కూడా ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పిల్లలు చేసిన తప్పేంటని ప్రశ్నిస్తున్నారు.

# బంగ్లాకు కాబోయే ప్రధాని

## ప్రజలకు ఇచ్చిన తొలి పిలుపు ఇదే..!



ఢాకా: గత కొన్ని నెలలుగా బంగ్లాదేశ్‌లో అరాచకమే చూస్తూ వస్తున్నాం. బంగ్లా అంతటా విధ్వంస చాయలే కనిపించాయి. షేక్ హసీనా బంగ్లా ప్రధానిగా వైదొలిగిన క్రమం నుంచి మహ్మద్ యూనస్ తాత్కాలిక బాధ్యతల్లో ప్రభుత్వం నడిచిన తీరును గమనిస్తే ఆ దేశంలో ఐక్యతా చాయలు సన్నగిల్లడమే కనబడింది. మన రెండు రోజుల్లో బంగ్లాదేశ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్న బీఎన్‌పీ అధినేత తారిఖ్ రెహ్మాన్.. పార్టీ అతిపెద్ద విజయం సాధించిన తర్వాత దేశ ప్రజలకు ఐక్యతా పిలుపే ఆయన తొలి పిలుపు అయ్యింది. బంగ్లాదేశ్‌లోని పరిస్థితులను గత కొంతకాలం నుంచి నిశితంగా గమినిస్తున్న తారిఖ్ రెహ్మాన్.. ఐక్యతకు పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం నెలకొనడానికి త్యాగం చేసిన వారికి ఈ విజయం అంకితం ఇస్తున్నట్లు రెహ్మాన్ ప్రకటించారు. "మీ స్వచ్ఛంద భాగస్వామ్యంతో, దాదాపు పదిన్నర సంవత్సరాల తర్వాత, ప్రజలకు నేరుగా ఓటు ద్వారా బాధ్యత వహించే పార్లమెంట్, ప్రభుత్వం దేశంలో తిరిగి స్థాపించబడుతున్నాయి," అని రహ్మాన్ అన్నారు. ఆయన ప్రజలను ఐక్యంగా నిలబడమని కోరుతూ, ఏ దుష్ట శక్తి దేశంలో మళ్లీ నియంతృత్వాన్ని స్థాపించకుండా, దేశం బానిస రాష్ట్రంగా మారకుండా చూసుకోవాలి' అని పిలుపునిచ్చారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 15-02-2026
ANN తెలుగు



# బన్నీని చూసి బాలీవుడ్ రగిలిపోతోందా?

'పుష్ప 2' ఘన విజయం తర్వాత, దక్షిణాది నటుల్లో ఎవరికీ రానంత దేశవ్యాప్త క్రేజ్ అల్లు అర్జున్‌కి రావడం, జవాన్ సినిమా తీసిన అట్లీ తన రెండో సినిమాకి ఎంచుకోవడం...అలాగే బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొణే వంటి స్టార్స్‌తో బన్నీ కలిసి నటించనుండడం వంటివి జరిగాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ బాలీవుడ్‌లో కొందరికి ముప్పుగా కనిపిస్తున్నారా? అనే ప్రశ్నకు కొందరు సినీ పెద్దలు అవుననే సమాధానమే చెబుతున్నారు. ఈ మేరకు ప్రస్తుతం అటు టాలీవుడ్ ఇటు బాలీవుడ్‌లో సినీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ సంఘటన తర్వాత అల్లు అర్జున్ ఎదుర్కొన్న పరిణామాలు తను కొందరు ప్రముఖులకు టార్గెట్‌గా మారాడనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించాయి. తాజా పరిణామాల నేపథ్యంలో బన్నీ ని ఈ సారి వేరే రకంగా టార్గెట్ చేశారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**వివాదమా? బాలీవుడ్ వ్యూహమా?**

ఇండియన్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఓ బ్రాండ్ స్ట్రాటజిస్ట్ అల్లు అర్జున్ ను కలవాలంటే ఏకంగా 42 కఠినమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, అందులో కళ్లలోకి చూడకూడదు, చేతులు కలపకూడదు వంటి ఆంక్షలు కూడా ఉన్నాయని ఆరోపించారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. ఫలితంగా అల్లు అర్జున్ పేరు అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రెండింగ్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరగడంతో, నిజంగానే ఇలాంటి నిబంధనలు ఉన్నాయా? అని కొందరిలో సందేహాలు వ్యక్తమవడం సహజమే. అయితే అదే సమయంలో కొందరు ఇది అల్లు అర్జున్ పెరుగుతున్న పాన్ ఇండియా క్రేజ్‌ను తగ్గించేందుకు చేసిన ప్రయత్నమని అభిప్రాయపడుతున్నారు.ఈ క్రమంలోనే ఇలాంటి వివాదాలను కావాలనే పెద్దవిగా చేసి ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇలా టాలీవుడ్ స్టార్స్‌పై వ్యతిరేక ప్రచారం జరగడం ఇదే తొలిసారి కాదు. గతంలో 'బాహుబలి', 'సాహో' సినిమాల భారీ విజయం తర్వాత ప్రభాస్ కూడా ఇలాంటి విమర్శలు, నెగెటివ్ ప్రచారం చేశారని కొందరు గుర్తు చేస్తున్నారు. బాలీవుడ్‌లో చెప్పుకోదగ్గ ఆదరణ పొందిన దక్షిణాది నటులు ఇలాంటి కుట్రలను ఎదుర్కోవాల్సి వస్తుందనే అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

## అల్లు అర్జున్ టీమ్ స్పందన..

తమపై పడిన వివాదంపై అల్లు అర్జున్ టీమ్ వెంటనే స్పందించి వైరల్ అవుతున్న ఆరోపణలు అసత్యమని, ఆధారంలేనివని స్పష్టం చేసింది. అల్లు అర్జున్ ఎప్పుడూ గౌరవంగా, వినయంగా వ్యవహరిస్తారని, ఇలాంటి ప్రచారం ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో చేస్తున్నదని కూడా తేల్చి చెప్పడం గమనార్హం. ఈ ఉదంతంపై తగినంత కూపీ లాగి కుట్రలపై ఆధారం దొరికిన తర్వాతే అల్లు టీమ్ ఇలా చెప్పి ఉంటుందనేది నిస్సందేహం. అంతేకాదు అల్లు అర్జున్ పై తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది కూడా. తద్వారా ఇకపై కూడా ఇలాంటివి జరిగే అవకాశం ఉందని అల్లు అండ్ కో భావిస్తున్నట్టు అర్థం అవుతోంది.

ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ ప్రాజెక్టులతో బిజీగా అల్లు అర్జున్ ప్రస్తుతం అల్లు అర్జున్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దర్శకుడు అట్లీతో కలిసి ఓ భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కలిసి రెండు భాగాలుగా రూపొందనున్న ఓ భారీ సినిమా కూడా త్వరలో ప్రారంభం కానుంది. , అల్లు అర్జున్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ కుట్రలలో ఆరితేరిన చరిత్ర ఉన్న కొన్ని బాలీవుడ్ మీడియా సంస్థల విషయంలో అల్లు అర్జున్ అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం కనిపిస్తోంది.



# ప్రేక్షకులు నిరాశ చెందరు

**నాగవంశీ**

విశ్వక్ సేన్ , కయాదు లోహర్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'ఫంకీ'. కేవీ అనుదీప్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం రిలీజైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ సక్సెస్‌మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ-"సినిమా రిలీజ్‌కు ముందు ఒత్తిడితో ఉండటం సహజం. కానీ 'ఫంకీ' సినిమా రిలీజ్‌కు ముందు చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఈ రోజు ఉదయం ప్రేక్షకులతో కలిసి ఈ మూవీ చూశాను.. వారు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'ఫంకీ' నాకెంతో ఊరటనిచ్చింది" అన్నారు. "కుటుంబంతో కలిసి ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా, ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీయాలనే 'ఫంకీ' చేశాం. ప్రేక్షకుల స్పందన సంతోషాన్నిఇస్తోంది" అని తెలిపారు కేవీ అనుదీప్. "ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతో చేసిన సినిమా ఇది. ఈ విషయంలో మేం విజయం సాధించాం. మా డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీ. నవ్వుకోవడానికి థియేటర్స్‌కు వచ్చిన వారు నిరాశ చెందరు" అన్నారు నాగవంశీ. "మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్" అన్నారు కయాదు లోహర్.

# బర్త్ డేరోజు గుడ్‌న్యూస్ చెప్పిన శివజ్యోతి..






యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ శివజ్యోతి గుడ్‌న్యూస్ చెప్పింది. తనకు పండంటి బిడ్డ పుట్టినట్లు వెల్లడించింది. ఫిబ్రవరి 12న బేబీ జన్మించగా రెండు రోజులు ఆలస్యంగా ఈ విషయాన్ని సోషల్ మీడియాలో వెల్లడించింది. ఈ పోస్ట్‌కు ఓ అందమైన ఫోటో జత చేసింది. అందులో శివజ్యోతి కుర్చీలో కూర్చుని నవ్వులు చిందిస్తుండగా ఆమె భర్త గంగూలీ బిడ్డను ఎత్తుకున్నాడు. ఈరోజు (ఫిబ్రవరి 14న) శివజ్యోతి బర్త్‌డే సందర్భంగా బేబీ రాకను వెల్లడించారు.

**ఇద్దరి గుండెచప్పుడు ముగ్గురిగా..**

తనకు ఇంత అందమైన బహుమతిచ్చిన శివజ్యోతికి గంగూలీకి కృతజ్ఞతలు తెలిపాడు. 'హ్యాపీ బర్త్‌డే, చిన్ని. నీ 33వ పుట్టినరోజుకు ఎంతో అందమైన బహుమతిని తీసుకొచ్చావ్. మన ఇద్దరి గుండెచప్పుడు ఇప్పుడు ముగ్గురిగా మారింది. మాకు పుట్టింది పాప? బాబు? అన్న విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తాం' అని రాసుకొచ్చాడు. ఇది చూసిన అభిమానులు శివజ్యోతి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ప్రేమికుల రోజు రక్తపాతం చూపించిన లోకేశ్





దర్శకులందరూ హీరోలవుతున్నారు. అలా తమిళ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కూడా 'డీసీ' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నాడు. బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయాన్ని గతేడాది ప్రకటించారు. నేడు (ఫిబ్రవరి 14) ప్రేమికుల రోజు సందర్భంగా.. బ్లడీ వాలంటైన్ అంటూ డీసీ గ్లింప్స్ వదిలారు. అందులో ప్రేమ కన్నా రక్తపాతమే ఎక్కువ చూపించారు. లోకేశ్ పీకలు కోస్తూ కనిపించాడు. చివర్లో కారుపై కూడా రక్తమే కనిపిస్తోంది. చిన్న వీడియోలోనే ఇంత వయొలెన్స్ ఉంటే సినిమాలో ఎంతుంటుందో చూడాలి! డీసీ విషయానికి వస్తే.. లోకేశ్ దేవదాస్‌గా, వామిక గబ్బి.. చంద్ర పాత్రలో కనిపించనున్నారు. వీరి పేర్ల కలయిక ఆధారంగానే డీసీ (దేవదాస్ + చంద్ర) అని టైటిల్ పెట్టినట్లు తెలుస్తోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకతత్వం వహించిన ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ ఏడాది వేసవిలో ఈ మూవీ రిలీజ్ చేయనున్నారు. కాగా ఖైదీ, విక్రమ్, కూలీ సినిమాలతో దర్శకుడిగా క్రేజ్ అందుకున్న లోకేశ్ హీరోగా ఎలాంటి సక్సెస్ అందుకుంటాడో చూడాలి!



# కుర్రాళ్లను కవ్విస్తున్న అనన్య నాగళ్ల

తెలుగు అమ్మాయిలకు ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో మంచి అవకాశాలు వస్తున్నాయి. తెలుగు అమ్మాయిలో ఇప్పుడు చాలా మంది హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. వారిలో అనన్య నాగళ్ల ఒకరు. మల్లేశం సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. తొలి సినిమాతోనే మెప్పించింది. మల్లేశం సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తన నటనతో ఆకట్టుకుంది అనన్య నాగళ్ల. తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అనన్య హైదరాబాద్ లో నే బీటెక్ పూర్తి చేసింది. ఆ తర్వాత ఇన్ఫోసిస్ లో సాఫ్ట్ వేర్ ఉద్యోగంలో కూడా చేరింది. అయితే జాబ్ చేస్తూనే షార్ట్ ఫిల్మ్స్ లో నటించింది. షాదీ అనే షార్ట్ ఫిల్మ్ లో నటించినందుకు ఆమెకు ఉత్తమ నటిగా సైమా అవార్డ్ అందుకుంది. ఆ తర్వాత ప్రియదర్శితో కలిసి మల్లేశం అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. పవన్ కల్యాణ్ వకీల్ సాబ్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత మ్యాస్ట్రో, ఊర్వశివో రాక్షసివో, శాకుంతం, మళ్లీపెళ్లి, పొట్టేల్, తంత్ర తదితర సినిమాలతో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. కానీ హిట్స్ మాత్రం సొంతం చేసుకోలేకపోతుంది. 12 సినిమాలు చేసిన ఈ అమ్మడు కేవలం 2 హిట్స్ మాత్రమే అందుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నపటికీ సక్సెస్ మాత్రం అందుకోలేకపోయింది ఈ అందాల భామ. దాంతో ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ మెప్పిస్తుంది ఈ అమ్మడు. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు మెప్పిస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com